ప్రజాశక్తి
బుధవారం 6 సెప్టెంబర్ 2023 5 విజయనగరం

డిఆర్ఒగా అనిత

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

జిల్లా రెవెన్యూ అధికారిగా ఎస్‌డి అనిత నియమితులయ్యారు. ఇక్కడ డిఆర్ఒగా ఉన్న ఎం.గణపతిరావు శ్రీకాకుళం జిల్లా డిఆర్ఒగా బదిలీ కాగా, విశాఖలో ఎపిఐఐసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా ఉన్న అనిత ఇక్కడికి బదిలీపై వచ్చారు. గతంలో అనిత జిల్లాలో ఫారెస్టు సెటిల్ మెంట్ అధికారిగా, పలు శాఖల ఇన్‌ఛార్జి అధికారిగా విధులు నిర్వహించారు. అలాగే వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ కలెక్టర్ బి.పద్మావతి పార్వతీపురం మన్యం జిల్లా సర్వే అండ్‌ల్యాండ్ రికార్డ్సు అధికారిగా నియమితులయ్యారు.

గుర్ల మండలంలో ఎండిపోతున్న వరినాట్లు

- 48,578 ఎకరాల్లో వెనుకబాటు
- అత్యధికంగా 28వేల ఎకరాల్లో వరి సాగు తగ్గుదల
- నేటికీ సాగుకు నోచుకోని లక్ష ఎకరాల ఇతర పంటలు
- వర్షపాతంలో సమతుల్యతా లోపమే కారణం
- ఆందోళనలో అన్నదాత

లక్ష్యానికి దూరంగా ఖరీఫ్ సాగు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మారిన వాతావరణ పరిస్థితుల వల్ల వర్షపాతంలో సమతుల్యత లేకపోవడంతో ఖరీఫ్ పంటల సాగు జిల్లాలో నత్తనడకన సాగుతోంది. సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడిచినా కనీసం 3లక్షల ఎకరాల్లో కూడా పంటల సాగు కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ పంటలన్నీ కలిపి 48,578 ఎకరాల్లో వెనుకబాటు కనిపిస్తోంది. అత్యధికంగా వరి 28వేల ఎకరాలకుపైగా తగ్గింది. జిల్లాలోని సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే నేటికీ లక్ష ఎకరాలు వరకు సాగుకు నోచుకోలేదు. దీంతో, రైతుల్లో ఆందోళన మొదలైంది.

జిల్లాలో పెద్దగా సాగునీటి వనరులు లేకపోవడంతో ఎక్కువ భాగం వర్షాధారంగానే సాగవుతుంది. జూన్ రెండోవారం నుంచి ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న సంగతి తెలిసిందే. జూన్‌లో 52 మిల్లీ మీటర్ల లోటు వర్షపాతం నమోదైంది. జులైలో 82 మి.మీ వర్షం అధికంగా కురిసినప్పటికీ, ఆగస్టులో తిరిగి 24 మి.మీ. లోటులోకి వెళ్లింది. తిరిగి సెప్టెంబర్‌లో (గడిచిన ఐదు రోజుల్లో) అధిక వర్షపాతం నమోదైంది. వర్షపాత సమతుల్యత లేకపోవడం వల్ల వివిధ మండలాలు, ఆయా మండలాల్లోని గ్రామాల మధ్య వర్షపాతం హెచ్చుతగ్గులు ఉన్నాయి. దీంతో, ఈ మేరకు మండలాలు, గ్రామాల మధ్య పంటల సాగు విస్తీర్ణంలో కూడా హెచ్చుతగ్గులు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వరి, మొక్కజొన్న, పత్తి, చెరకు, వేరుశనగ, పెసలు, మినుములు, తదితర అపరాల పంటలన్నీ కలుపుకుని ఈ ఏడాది 3,13,465 ఎకరాల్లో సాగు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు కేవలం 2,08,407 ఎకరాల్లో మాత్రమే సాగు కనిపిస్తోంది. దీన్నిబట్టి 94,195 ఎకరాల్లో వెనుకబాటు ఉన్నట్టు స్పష్టమౌతోంది. గత ఏడాది ఇదే తేదీ (సెప్టెంబర్ 5) నాటికి 2,56,985 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ లెక్కన వివిధ పంటల సాగు 48,578 ఎకరాల మేర వ్యత్యాసం కనిపిస్తోంది. ఇందులోనూ అత్యధికంగా వరి 27,770 ఎకరాల్లో ఉబాలు తగ్గినట్టు స్పష్టమౌతోంది. మొక్కజొన్న 7,690ఎకరాలు, నువ్వులు 7,610 ఎకరాలు, పత్తి 1,155 ఎకరాలు, చెరకు 1,189 ఎకరాలు, చివరకు ప్రభుత్వం అత్యంత ప్రోత్సాహం ఇస్తున్నట్టు చెబుతున్న చిరుధాన్యాల సాగు కూడా 3,543ఎకరాల్లో తక్కువగానే ఉంది.

చాలీచాలని రైన్‌గేజ్ స్టేషన్లు

జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోనూ రైన్‌గేజ్ స్టేషన్లు ఉన్నాయి. వీటితోపాటు కొన్ని మండలాల్లో 37 ఆటోమేటిక్ రైన్‌గేజ్, 52 ఆటోమేటిక్ వెదర్ గేజ్ స్టేషన్లు ఉన్నాయి. వాతావరణ పరిస్థితుల్లో వచ్చిన మార్పుల నేపథ్యంలో ఇవి ఏమాత్రం సరిపోయే పరిస్థితి లేదని నిపుణులు చెబుతున్నారు. ఇటీవల కాలంలో రెండు గ్రామాలు, లేదా పొలాల మధ్య కూడా వర్షపడడం, పడకపోవడం వంటివి చూస్తున్నాం. అలాగే ఒక్కోచోట కుండపోత వర్షాలు, దానికి కొద్ది దూరంలోనే మండుటెండలతో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఈనేపథ్యంలో పరిమితమైన రైన్‌గేజ్, వెదర్ గేజ్ స్టేషన్ల వర్షాపాత సమతుల్యతను లెక్కించడం సాధ్యం కావడం లేదు. ఈ నేపథ్యంలో 2018లో జిల్లాలోని వర్షపాతంపై పరిశోధనలు చేసిన శాస్త్ర వేత్తలు రెండు లేదా మూడు రెవెన్యూ గ్రామాల మధ్య ఒక రైన్‌గేజ్ ఏర్పాటు చేయాల్సిన అవసరముందని సూచించినట్టు సమాచారం.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్,మేయర్, డిఆర్ఒ, డిఇఒ

అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

- 71 మంది ఉపాధ్యాయులకు అవార్డులు
- విద్యార్థుల వ్యక్తిత్వాన్ని వికసింప జేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవం విద్యాశాఖ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 71 మందికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ కె.నాగలక్ష్మి, నగరమేయర్ వి.విజయలక్ష్మి ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో వ్యక్తిత్వాన్ని వికశింపజేయడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలు ఎక్కువ సమయం బడిలోనే గడుపుతారని, వారిలో ప్రతిభ, నైపుణ్యం గుర్తించే అవకాశం ఉపాధ్యాయులకే ఉంటుందని పేర్కొన్నారు. పిల్లల్లో దాగివున్న నైపుణ్యాన్ని గుర్తించి పదును పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని అన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి చేస్తున్న సేవలను గుర్తించి, ఇతరులకు స్ఫూర్తినిచ్చేందుకు, టీచర్స్ డే సందర్భంగా ప్రభుత్వం ఈ సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. వారి కృషి, అంకిత భావాన్ని ప్రశంసించారు. గత నాలుగేళ్లుగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదన్న లక్ష్యంతో, ప్రభుత్వం అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యాదీవెన, విదేశీ విద్యా దీవెన లాంటి పథకాలను అమలు చేస్తోందని అన్నారు. విద్యార్థుల జీవితాలను సమున్నతంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ, విద్య ద్వారానే ఉన్నత శిఖరాలకు చేరుకోవడం సాధ్యమవుతుందని అన్నారు. సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డిఆర్ఒ ఎం.గణపతిరావు, డిఇఒ బి.లింగేశ్వరరెడ్డి ఉపాధ్యాయుల సేవలను గుర్తు చేస్తూ ప్రశంసించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. డిఆర్ఒ ఎం.గణపతి రావు, జెడ్‌పి సిఇఒ కె.రాజ్ కుమార్, డిఇఒ బి.లింగేశ్వర రెడ్డి, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.టి. నాయుడు, ఉప విద్యాశాఖ అధికారులు బ్రహ్మాజీ, వాసుదేవరావు, విద్యాశాఖసిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి, మేయర్ విజయలక్ష్మి, డిఆర్ఒ గణపతిరావు, డిఇఒ లింగేశ్వరరెడ్డి

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జిల్లాకు చెందిన రేగిడి ఆముదాలవలస జెడ్‌పి హైస్కూలు బయోలజి అసిస్టెంట్ బి.ఉమామహేశ్వరి, గుర్ల మండలం పెద బంటుపల్లి ఎంపిపిఎస్ ఉపాధ్యాయుడు జట్ల పైడిరాజు, తెర్లాం మండలం వెలగపూడి జెడ్‌పి హైస్కూలు గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయుడు జెబి ధనుంజయ నాయుడు మంగళవారం విశాఖలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ నుంచి అవార్డులు అందుకున్నారు. - ప్రజాశక్తి..తెర్లాం, గుర్ల, రేగిడి

విఓఎలకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విఓఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దుచేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, విఓఎలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం సెర్ప్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని కోరారు. రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, అన్ని రకాల బకాయిలు చెల్లించాలని కోరారు. లోకో యాప్ వర్క్ కోసం 5 జి మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. వాలంటీర్ ఐడితో విఓఎతో పనిచేయించరాదన్నారు. విఒల మెర్జ్ వలన ఉపాధి కోల్పోయిన విఓఎలకు నష్ట పరిహారం ఇవ్వాలని, మహిళా మార్టులలో సరుకుల కొనుగోలుకై టార్గెట్ ఇచ్చే పద్ధతి రద్దు చెయ్యాలని డిమాండ్ చేశారు. కూరగాయలు, ఆకుకూరల విత్తనాలు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, గేదెలు లాంటివి పొదుపుసంఘాల మహిళలతో బలవంతంగా కొనిపించే పద్ధతి ఆపాలని కోరారు. వినతి పత్రం అందచేసిన వారిలో సిఐటియు నాయకులు వి.లక్ష్మి, ఎ.జగన్మోహన్, బి.రమణ విఓఎలు పాల్గొన్నారు.

12న జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు

విజయనగరం : ఈనెల 12న జిల్లా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ కె.రాజకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటల నుంచి వరుసగా 1 నుంచి 7 వ స్థాయి సంఘ సమావేశాలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

'ద్వారం' గ్రంథాలయం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం కోట

కొత్తగ్రహారంలో గల ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ ద్వారా నిర్వహిస్తున్న రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీలో 'ద్వారమ్స్' లైబ్రరీ ని ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాదరావు మంగళవారం ప్రారంభించారు. ద్వారం నరసింగరావు జన్మదినాన్ని పురస్కరించుకుని ద్వారం కుటుంబం తరపున లైబ్రరీని మ్యూజిక్ అకాడమీకి ఇచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ తరపున సంగీత ఉపాధ్యాయులు రొటేరియన్స్ కలిసి ఆయనను సన్మానించారు. ఈ లైబ్రరీని సంగీతం నేర్చుకుంటున్న ప్రతీవారు ఉపయోగించు కోవాలని కోరారు. అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి, గౌరవాధ్యక్షులు డాక్టర్ డి.వి.శ్రీకాంత్, సభ్యులు, డి.బాలాజీ, కాపుగంటి రవి, గుండా చిన వీరభద్రరావు, ఉమా బాలాజీ, ఉసిరికల చంద్రశేఖర్ రావు, మేఘరాజ్ రాణీ, సూర్యలక్ష్మి, రాధికారాణి తదితరులు పాల్గొన్నారు.

కక్ష సాధింపు చర్యలు విడనాడాలి : సిఐటియు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని కొండకెంగువ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ కోటేశ్వరరావుపై కొంతమంది అధికార పార్టీ నాయకులు చేస్తున్న కక్ష సాధింపు చర్యలు విడనాడాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్య నారాయణ డిమాండ్ చేశారు. స్థానిక నాయకులు బలసా శ్రీనుతో కలిసి ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. నిబద్దతో పనిచేస్తూ ఉపాధి హామీ కూలీల మద్దతు ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పై స్థానిక ఎమ్మెల్యేకు తప్పుడు ఫిర్యాదులు ఇవ్వడం సిగ్గుచేటని అన్నారు. ప్రతిపక్ష టిడిపి మద్దతు సర్పంచ్‌గా ఇతని భార్య ఉండటంతో గ్రామంలో పట్టు సాధించేందుకు ఆయనను పావుగా చేస్తూ అధికార పక్షం నేతలు చేస్తున్న వికృత క్రీడ అని, దీన్ని తమ పార్టీ తరుపున ఖండిస్తున్నామని తెలిపారు. పూర్తి స్థాయి విచారణ చేయకుండా ఫిర్యాదుపై చర్యలు తీసుకోవడం ఎమ్మెల్యే స్థాయికి తగదన్నారు. అధికార పార్టీ నాయకులు చెప్పిన తప్పుడు పనులకు సహకరించక పోవడం, ఉపాధి పనికి రాకుండా వాళ్లకు సంబంధించిన వ్యక్తులు పేర్లు మస్తర్లలో నమోదు చేయకపోవడం వల్లే ఈ రాజకీయ కక్షలు చేస్తున్నారని అన్నారు. విధులు సమర్థనీయంగా నిర్వహిస్తూ, ప్రజాదరణ ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్‌కి ఎటువంటి నష్టం జరిగినా సిఐటియు ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి బలస శ్రీను, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలం, సిఐటియు నాయకులు సురేష్ పాల్గొన్నారు.

సచివాలయ భవనం ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం రూరల్

గుంకలాంలో రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన సచివాలయం టైప్-2 భవనాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ప్రారంభించి అందుబాటులోకి తీసుకొచ్చారు.ముందుగా భవన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కొత్తగా నిర్మించిన భవనాన్ని ప్రారంభించారు. అన్ని రకాల సేవలకు నిలయమైన సచివాలయం అందరికీ అందుబాటులో ఉన్న ప్రదేశంలో నిర్మించారని, పరిశరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అక్కడి వారికి సూచించారు. లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించే నిమిత్తం గుంకలాంలో రూ.6.8 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన 63 కెవివి ట్రాన్స్‌ఫార్మర్ ను వీరభద్ర స్వామి మీట నొక్కి ప్రారంభించారు. కార్యక్రమాల్లో గుంకలాం సర్పంచి నాగరాజు, ఎంపిపి మామిడి అప్పల నాయుడు, ఎఎంసి ఛైర్మన్ జమ్ము శ్రీను, స్థానిక ప్రజా ప్రతినిధులు, తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎఇ సంతోష్ కుమార్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సచివాలయాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీస్పీకర్ కోలగట్ల

ఆటో డ్రైవర్లకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన పలుచోట్ల ఆందోళనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటి యు) ఆధ్వర్యంలో విజయనగరం, దత్తిరాజేరు మండలం మానాపురం, ఎస్.కోటలో మంగళవారం ఆందోళనలు చేపట్టారు. కోట జంక్షన్ వద్ద జరిగిన రాస్తారోకోలో సిఐటియు నగర అధ్యక్ష ,కార్యదర్శులు ఎ. జగన్మోహన్‌రావు, బి. రమణ మాట్లాడుతూ నిరంతరం పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన అధిక ఫీజులు, పెనాల్టీలతో డ్రైవర్లంతా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రవాణా రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు మోడీ మోటారు వాహన చట్టం -2020 లో సవరణలు చేశారని, వీటి రద్దు కోసం దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అందులో భాగంగా సెప్టెంబర్ 16, 17 తేదీల్లో రాష్ట్ర వర్క్ షాప్ కర్నూల్లో నిర్వహిస్తున్నామని, అక్టోబర్ 6న చలో రాజభవన్ ఉంటుందని తెలిపారు. ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని, ఎస్‌సి, ఎస్‌టి,బిసి, మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా సబ్సిడీపై రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులకు కంది త్రినాద్ మద్దతు తెలిపారు. లక్ష్మణ్ దొర, రాము, నర్సింగ్, ప్రసాద్,శ్రీను, రామారావు, సురేషు, తిరుపతిరావు, భాస్కర్ రావు, తదితర ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

దత్తిరాజేరు : ఆటో కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో గర్భాం రోడ్డు జంక్షన్లో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ అధ్యక్షులు బి అప్పలనాయుడు, సిఐటియు నాయకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం పెరుగుతున్న పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన అధిక ఫీజులు, పెనాల్టీలతో డ్రైవర్లంతా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. రవాణా రంగాన్ని కార్పోరేట్ కంపెనీలకు కట్టబెట్టేందుకు మోడీ మోటర్ వాహన చట్టం 2020లో సవరణ చేశారని అన్నారు. వీటి రద్దు కోసం దేశవ్యాప్తంగా ఆటో వర్కర్స్ అందరూ ఆందోళనకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. . రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫీజులు, పెనాల్టీ జీవో నెంబర్ 21 ను రద్దు చేయాలని, ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డి గౌరీస్, యు అప్పల రాము, టి హరీష్, ఎల్ రాము, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చెలికాని ముత్యాలు, రావాడ సన్యాసిదేవుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు స్వయం శక్తితో బతకాలని నిశ్చయించుకుని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల వద్ద లోన్లు తీసుకొని ఆటోలు నడపుకుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు పాదం మోపుతున్నాయన్నారు.కార్యక్రమంలో సూర్య, రమణ, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

మానాపురం వద్ద రాస్తారోకో చేస్తున్న ఆటో కార్మికులు

అనారోగ్యంతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

జరజాపు పేట జెడ్‌పి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుడు ఎం.నల్లా జగదీశ్వరరావు (49) మంగళవారం మృతి చెందారు. ఆయన కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇటీవల అలుగోలు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా విధులు నిర్వర్తించి ఇటీవల జరిగిన బదిలీల్లో జరజాపు పేట పాఠశాలకు వచ్చారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.పరిస్థితి విషమించి కన్నుమూశారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

20 నుంచి జిల్లా స్థాయి క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 20 నుంచి పలు క్రీడాంశాల్లో ఎంపిక పోటీలు నిర్వహిస్తామని జిల్లా అండర్ 19 కార్యదర్శి కృష్ణ, డిఒఇఒ సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 21 క్రీడా అంశాల్లో ఇంటర్ విద్యార్థులు అర్హులని తెలిపారు. 2005 జనవరి 1 తర్వాత జన్మించిన వారు అర్హులని తెలిపారు. క్రీడాకారులు, జూనియర్ కళాశాల వ్యాయామ అధ్యాపకులు క్రీడా పోటీలకు, ఎంపికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన తరువాత రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామని తెలిపారు. వివరాలకు 9885111375 ఫోన్ నెంబర్ ను సంప్రదించాలని ప్రకటనలో తెలిపారు.

నాలుగో తరగతి ఉద్యోగులకు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో నాలుగో తరగతి ఉద్యోగులకు ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని కోరుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామికి ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మువ్వల గంగా ప్రసాదరావు కోరారు. మంగళవారం కోలగట్ల నివాసానికి వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా ఇళ్ల స్థలాల కోసం ఎదురు చూస్తున్నమన్నారు. వెంటనే ఇళ్ల స్థలాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన కోలగట్ల వీరభద్రస్వామి ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎం.మంగరాజు, ఎన్.లక్ష్మి, ప్రవళిక పాల్గొన్నారు.

ఘనంగా చిన్నశ్రీను పుట్టినరోజు వేడుకలు

పలుచోట్ల సామాజిక సేవా కార్యక్రమాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పుట్టినరోజు వేడుకలను వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నగరంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరమంతా అన్న దానాలు చేపట్టారు. మహిళలకు పసుపు కుంకుమలతో పాటు సారెగా బిందెలు, చీరలు పంపిణీ చేశారు. వృద్దులు, అనాధులకు పండ్లు పంచారు. పలు చోట్ల రక్తదాన శిబిరాలు ద్వారా అభిమానులు స్వచ్ఛంద రక్త దానం చేశారు. మరో వైపు నగరమంతా ఫ్లెక్సీలతో కార్యకర్తలు తమ అభిమానం చాటుకున్నారు. పైడితల్లి అమ్మవారి ఆలయంలో వైసిపి నాయకులు పిల్లా విజయ్ కుమార్, అవనాపు విజయ్ ఆధ్వర్యాన పూజలు చేశారు. బొడ్డు వారి జంక్షన్ కూడలి వద్ద అవనాపు విజయ్ తో కలిసి గొడుగులు పంపిణీ చేశారు. అంబటి సత్రం మస్తాన్ దర్గా వద్ద 500 మంది ముస్లిం మైనార్టీలకు దుప్పట్లు, వస్త్రాలు, రేషన్ పంచి పెట్టారు. ప్రేమసమాజంలో వృద్ధులకు భోజనం పంపిణీ చేశారు. స్టేట్ బ్యాంకు మెయిన్ బ్రాంచ్ వద్ద నిరుపేద కుటుంబానికి తోపుడు బండిని అందించారు. పినవేమలిలోని ఎబిసిడి వృద్ధాశ్రమం లో వృద్దులకు భోజనం పెట్టారు. నగరంలో ఫుడ్ కోర్టుల వద్ద ప్రజలకు అన్నదానం చేశారు.

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సిఇఒ రాజ్‌కుమార్ ఆధ్వర్యాన చిన్నశ్రీను జన్మదిన వేడుకలు జరిగాయి. రెడ్ క్రాస్ వారి ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. బొబ్బిలి జడ్‌పిటిసి శాంతి కుమారి, పిఆర్ ఇఇ కెజిజె నాయుడు, జెడ్‌పి ఛాంబర్ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో ఉపాధ్యాయులను ప్రజాప్రతినిధులు, అధికారులు సత్కరించారు. ఈ సందర్భంగా పిల్లలకు పలు క్రీడా పోటీలను నిర్వహించి గెలిపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కాగా టీచర్స్ డే సందర్భంగా పిల్లలు కట్టుకున్న వస్త్రధారణలు ఆకట్టుకున్నాయి..

ప్రజాశక్తి- చీపురుపల్లి

స్థానిక రవీంద్రభారతి పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఉయ్యన్ మజ్జి, జోనల్ ఇంచార్జి ఎన్.వెంకటేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. జి.అగ్రహారం ఎంపియుపి పాఠశాల ఆవరణలో ఆశయ యూత్ అసోసియేషన్, ప్రజా గ్రంథాలయం ఆధ్వర్యంలో రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ, ఇంచార్జి ఉపాధ్యాయులు అప్పన్నాయుడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ ఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి వేడుకలు, ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా విశ్రాంతి గురువులను సత్కరించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ క్యాదస్ చక్రవర్తి, ఎంఇఒ ప్రసాద్ రావు, ఎవిఐఎస్, ఎపిటిఎఫ్, యుటిఎఫ్, ఎస్టీయు, ఎన్టిటి టీచర్స్ ఫెడరేషన్ తదితర సంఘాల ప్రతినిధులు ఉపాధ్యాయులు, ఎఎస్ఐ రాజారావు, పోలీస్ సిబ్బంది శివ, సచివాలయ మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాడంగి: స్థానిక జెడ్పి పాఠశాలలో హెచ్ఎం సత్యనారాయణను, రాష్ట్ర స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, పీడీ బంగారునాయుడును విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని శ్రీ ఆదిత్య విద్యాలయం, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అలుగోలు, రామతీర్థం, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆదిత్య విద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎస్టి కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకర్రావు పాల్గొని సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన్ను పాఠశాల యాజమాన్యం సత్కరించింది. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల డిసిసిబి మేనేజర్ హరికిశోరేశ్వరరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సిహెచ్ ఆనందమూర్తి, అలుగోలు, రామతీర్థం జడ్పీ ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు జి.ఎస్.కాంతారావు, ఎస్ఆర్ఎల్ శాస్త్రి ఇతర సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సెంచూరియన్ లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని రిజిస్ట్రార్ డాక్టర్ పి. పల్లవి అన్నారు. మంగళవారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ప్రొఫెసర్ శాంతమ్మను రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి చేతుల మీదుగా శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్శిటీ అధ్యాపక బృందం పాల్గొంది.

నెల్లిమర్ల: రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్

శృంగవరపుకోట: గురుపూజోత్సవం సందర్భంగా మండలంలోని పలు పాఠశాలలోను, కార్యాలయాలలోను గురువులను పూజిస్తూ సన్మానాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని నారాయణాస్ కేంబ్రిడ్జ్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ పివిఎస్ఎస్ విశ్వనాధం, డీన్ తిరుపతిరావు, ఏ.జి.యం.శ్రీనివాసరావు, పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు గురువులను సన్మానించి పూజించారు. ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వేపాడ: మొక్కలు నాటుతున్న టిడిపి నాయకులు గొంప కృష్ణ, వెంకటరావు

కొత్తవలస: కొత్తవలస, దెందేరు, వియ్యంపేట కంటకాపల్లి హైస్కూల్లో, రవీంద్ర భారతి పాఠశాలలో, మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కంటకాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు వి.అరుణకుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో కొత్తవలస మండల కార్యాలయం సమావేశ భవనంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ ఆధ్వర్యంలో 6 గురు ఉపాధ్యాయులను ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు చేతులు మీదుగా సన్మానించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎన్ శ్రీదేవి, కొప్పలవెలమ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.నాయుడుబాబు, పిఎసి చైర్మన్ గొరపల్లి శివ పాల్గొన్నారు.

విజయనగరంటౌన్: ఉపాధ్యాయ దినోత్సవం మంగళవారం పలు పాఠశాలలు, కళాశాలల్లో ఘనంగా జరిగింది. మంచి ఉపాధ్యాయుల కృషి వల్ల మంచి సమాజం తయారౌతుందని, అలాంటి ఉపాధ్యాయునికి మనము ఎప్పటికీ రుణపడి ఉంటామని గిరిజన యూనివర్శిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ కట్టిమని అన్నారు డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ చిత్ర పటానికి పులా మాలవేసి నివాళులర్పించారు అనంతరం మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ ఉపాధ్యాయులకే వన్నె తెచ్చిన మహోన్నతమైన వ్యక్తి అని, అటువంటి మహనీయుని అడుగుజాడలలో నడవాల్సిన అవసరం నేటి ఉపాధ్యాయులకు ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ డీన్లు ప్రొఫెసర్ శ్రీనివాసన్ తంత్రవాహి, ప్రొఫెసర్ జితేంద్ర మోహన్ మిశ్రా, కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్ ప్రొఫెసర్ కివడే తదితరులు మాట్లాడారు.

జెఎన్‌టియు గురజాడలో : జెఎన్‌టియు గురజాడలోఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. వెంకట సుబ్బయ్య ముందుగా డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ గారి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం మాట్లాడుతూ గొప్ప విద్యార్థులను తయారు చేసి దేశానికి దోహదపడేలా చేసే గొప్ప అవకాశం కేవలం ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని, నైతిక విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడం ఉపాధ్యాయులకు గొప్ప అవకాశమని అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ గారినీ ప్రతి ఉపాధ్యాయుడు ఆదర్శంగా తీసుకొని నేటి సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని ఆకాంక్షించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. జయ సుమ, డైరెక్టర్లు,ప్రిన్సిపాల్, వివిధ విభాగాల హెడ్‌లు పాల్గొన్నారు.

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి సెంచూరియన్ యూనివర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.ఎస్.ఎన్.రాజు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సమాజంలో ఉపాధ్యాయులకు ప్రముఖ స్థానం ఉందని, తల్లి, తండ్రి తరువాత స్థానం గురువుకే ఉందని అన్నారు. విద్యార్థులు నిజాయితీ, జాతీయతా భావాన్ని మరియు సమయపాలనను అలవర్చుకోవాలని ఈ సందర్భంగా తెలిపారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జీవితం ఎంతో మంది ఉపాధ్యాయులుకు ఆదర్శమని, వారిని ఉపాధ్యాయులంతా అనుసరించాలని ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామ మూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెంచూరియన్ ఛాన్సలర్‌ను సత్కరిస్తున్న సీతం ఇంజనీరింగ్ కళాశాల బృందం

శ్రీ చైతన్య పాఠశాలలో: నేడు సమాజంలో ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులకైనా ఉపాధ్యాయుడే మార్గదర్శి అని శ్రీచైతన్య పాఠశాల ప్రాంతీయ పర్యవేక్షకులు వి.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాలలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవంలో పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా అందరినీ అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబు, డీన్లు కె. సత్యనారాయణ, సాయి కిషోర్, సూర్య చంద్ర, ఎ. అప్పలనాయుడు, ప్రైమరీ ఇన్చార్జి పావని తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను పురస్కరించుకుని మండల కేంద్రంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు విద్యార్థులు పలు క్రీడా పోటీలు నిర్వహించారు. క్రీడలలో గెలుపొందిన విజేతలకు విద్యార్థులు జ్ఞాపికలను బహుకరించారు. వారి వారి తరగతి టీచర్ల మాదిరి వేషధారణతో ఉపాధ్యాయ అవతారమెత్తి వారు బోధించే విధానాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్ వెంకటరమణ, కరాటే శిక్షకులు రాజు మాస్టర్, ఉపాధ్యాయులు డి రామసత్యం, ఎస్ ప్రదీప్, ఎస్ హారిక, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలలో సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీవేణుగోపాల మున్సిపల్ పాఠశాల, సంస్థానం పాఠశాల, శ్రీచైతన్య విద్యా నికేతన్, అభ్యుదయ పాఠశాల, విజేత స్కూల్, వాసు, సత్యసాయి, తాండ్రపాపరాయ, గాయత్రీ, విద్వాన్ జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

భోగాపురం: స్థానిక అవంతి రీసెర్చ్, టెక్నాలజికల్ అకాడమీలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. జెఎన్‌టియు గురజాడ ప్రిన్సిపాల్ డాక్టర కుమార్ పాల్గొని రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ చందు సుబ్బారావు, కళాశాల డైరెక్టర్ ఎస్.రాఘవరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

తెర్లాం: మండల కేంద్రంలోని మంగళవారం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి విద్యాశాఖాధికారి త్రినాధరావు, ఎంపిడిఒ రామకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిఒ రాజ్యలక్ష్మి, సూపర్‌వైజర్లు, తెర్లాం పెరుమాలి కేంద్రాల్లో, గ్రంథాలయాల్లో నివాళులర్పించారు.

వేపాడ: బక్కునాయుడుపేట గ్రామం వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మంగళవారం మొక్కలను నాటారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో సుమారు నాలుగు ఎకరాలలో 139 వివిధ రకాల పండ్ల మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, ఐటిడిపి మండల అధ్యక్షుడు సేనాపతి గణేష్, మండల మహిళా చైతన్య కమిటీ చైర్మన్ గొంప తులసి, పలువురు టిడిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దెంకాడ: ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక ఎంఇఒ కార్యాలయంలో గత ఎంఇఒలను, ప్రస్తుత ఎంఇఒలను ఘనంగా సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డు తీసుకున్న యు.ప్రమీలారాణి, యు.ఉమాదేవిలను కూడా సత్కరించారు. సుదీర్ఘ కాలం మండల విద్యా వనరుల కేంద్రంలో మెసెంజర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన లెంక రామ్మూర్తిని సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన సాధన యువజన సంఘం

నెల్లిమర్ల: సాధన యువజన సంఘం 12 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జరజాపుపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా యువజన సంఘం అధ్యక్షులు దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ సాధన యువజన సంఘం స్థాపించినప్పటి నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశామన్నారు. దీనిలో భాగంగా రక్త దాన శిబిరాలు, గ్రంథాలయాలకు ఉచితంగా పుస్తకాల పంపిణీ, విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి ప్రోత్సహిస్తున్నామన్నారు. అందరి సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఇంఛార్జి అప్పలనాయుడు, కుర్మారావు, ఉమా మహేష్, అసిరనాయుడు, మురళి, పిఇటి సూర్యనారాయణ, రమణ, రామ్ అవతార్, గంగాధర్, ఆదినారాయణ, సాధన యువజన సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ పాల్గొన్నారు.

అప్పన్నదొరపాలెంలో మెగా వైద్య శిబిరం

కొత్తవలస: మండలంలో అప్పన్నదొరపాలేం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సుబ్బలక్ష్మి చార్టిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 150 మంది రోగులకు బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఇందులో 19 మంది కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్టు పుష్పగిరి ఆసుపత్రి వైద్యులు ఎంఎస్ఎన్ రాజు నిర్ధారణ చేశారు. వీరిని విజయనగరం పుష్పగిరి ఆసుపత్రికి తరలించి కంటి శస్త్ర చికిత్సలు ఉచితంగా చేసి మళ్ళీ గ్రామంలో వదిలి పెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పి.సాయికుమార్, ఆసుపత్రి కోఆర్డినేటర్ కోలా అబీ, శ్రీనివాస్, సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కనకాల శివ, కొత్తవలస మాజీ సర్పంచ్ అప్పారావు, పొట్నూరి రత్నాజీ పాల్గొన్నారు.

ఆర్‌బికె పరిశీలన

కొత్తవలస:మండలంలోని కాటకాపల్లి ఆర్‌బికె కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి విటి రామారావు మంగళవా రం సందర్శించారు. ప్రధాన మంత్రి కిసాన్ నిధి ఆధార్ సీడింగ్ విధానం, ఖరీఫ్ సీజన్‌లో జరుగుతున్న పంట నమోదు, ఎరువుల సరఫరా వంటి అంశాల మీద విహెచ్ఎ అయ్యప్పని అడిగి తెలుసుకున్నారు. అర్హులైన రైతులందరికి పీఎం కిసాన్ నగదు అందేలా చూడాలని, పంట వేసిన ప్రతి ఒక్క రైతుకు పంటను ఆన్లైన్‌లో నమోదు చెయ్యాలని సూచించారు. కార్యక్రమంలో ఎఒ మాధురి శరణ్య పాల్గొన్నారు.

ఆర్థిక పరిపుష్టికి శిక్షణ దోహదం

కొత్తవలస : వైకెపి గ్రామైఖ్య సంఘాలు ఆర్థిక పరిపుష్టి కలగడానికి శిక్షణ తరగతులు దోహదపడతాయని ఏరియా కోఆర్డినేటర్ ఎన్. ఆదయ్య అన్నారు. స్థానిక మండల సమైక్య భవనంలో ఎస్‌కోట ఏరియా కోఆర్డినేటర్ ఎన్. ఆదయ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘాల అధ్యక్షులకు, విఒఎలకు ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ పై రెండు రోజులు శిక్షణా కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. ఈ శిక్షణలో ఆర్థిక సుస్థిరత, ఆర్థిక లావాదేవుల పనితీరు, సంస్థ లాభనష్టాలు, అంతర్గత బహిర్గత ఆడిట్లు, మొదలగు అంశాలపై చర్చించారు. ఈ కర్యాక్రమంలో ఎపిఎం జి. శ్రీనివాసరావు, స్వేప్ ఎపిఎం ఎం. వెంకటరమణ, శ్రీనిధి మేనేజర్ రమణ, సీసీలు స్వామి, సన్యాసి విఒఎలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

ఒకరు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

బొండపల్లి : మండలంలోని చందకపేట జంక్షన్ వద్ద గల 26వ జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఆగి ఉన్న లారీని ఆటో ఢీ కొట్టిన సంఘటనలో దత్తిరాజేరు మండలం పెదకాద గ్రామానికి చెందిన బొద్దాన పాపయ్య మృతి చెందగా, మరో వ్యక్తి బొద్దాన రాముకు తీవ్ర గాయాలయ్యాయి. బొండపల్లి పోలీసులు అందించిన సమాచారం ప్రకారం.. పెదకాద గ్రామానికి చెందిన బొద్దాన పాపయ్య, బొద్దాన రాము కూరగాయలను ఆటోలో విజయనగరం తీసుకు వెళుతుండగా వీరు ప్రయాణిస్తున్న ఆటో ఆగి ఉన్న లారీ వెనుక భాగాన బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పాపయ్య, రాములకు తీవ్ర గాయాలు కావడంతో విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ పాపయ్య మృతి చెందగా, రాము పరిస్థితి విషమంగా ఉంది. ఆటో డ్రైవర్ బొద్దాన సురేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

దెంకాడ: మండలంలోని మోపాడలో విద్యుత్ షాక్ తగిలి తుమ్మగంటి అచ్చిబాబు (36) సోమవారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాలు ప్రకారం.. అచ్చిబాబు సోమవారం తన ఇంట్లో ఫ్యాన్ వేసుకునేందుకు స్విచ్ వేయగా కరెంటు షాక్ తగిలి కింద పడిపోయాడు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎవరు చూడలేదు. కొంత సమయం పోయిన తర్వాత పక్కింట్లో ఉన్న వారు వచ్చి చూడగా కింద అచ్చిబాబు పడిపోయి ఉన్నాడు. దీంతో వెంటనే ఆయన్ను గ్రామంలో ఉన్న పిహెచ్‌సికి తరలించారు. పరిస్థితి విషమించడంతో విజయనగరం తరలించారు. అక్కడ తనిఖీ చేసిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు స్థానిక ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక స్థితిగతుల మెరుగుకే సంక్షేమం

ప్రజాశక్తి- దెంకాడ

పేదల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర రావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పలనాయుడు తెలిపారు. మండలంలో జొన్నాడలో రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం వారు ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమత రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరికి పథకాల అందజేస్తున్నామన్నారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. దేశంలో అన్ని రాష్ట్రాలు ఆంధ్ర రాష్ట్రం వైపు చూస్తున్నాయని తెలిపారు. ప్రతిపక్ష నాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ అధికారంలోనికి రావడం కల అని వారి ఎట్టి పరిస్థితుల్లోనూ అధికారంలోకి రారని జోష్యం పలికారు. అనంతరం అంగన్వాడి కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాలను పరిశీలించి వారికి ప్రభుత్వం అందజేసిన రెండు జతల బట్టలను పంపిణీ చేశారు. గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించారు. అంగన్వాడి పిల్లలకు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం నూతనంగా మంజూరైన 400 పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే ఎంపిలకు అంగన్వాడీ కార్యకర్తల నాయకురాలు కృష్ణ వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ పిసురేష్ బాబు, నియోజవర్గంలోని నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ మండల అధ్యక్షులు, మున్సిపాలిటీ చైర్మన్లు వైస్ ఎంపిపిలు, వైస్ చైర్మన్లు, వివిధ రాష్ట్ర డైరెక్టర్లు, ఆకులపేట సర్పంచ్ కోరాడ రమణి, కోటి నాయుడు, రమేష్, ఎంపిటిసి దేవి మురళీ పాల్గొన్నారు.



పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, ఎంపి

వార్డెన్లతో సమీక్షా సమావేశం

నియోజకవర్గంలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి బిసి వసతి గృహాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. మండలంలోని జొన్నాడలో హాస్టల్ వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 హాస్టళ్ళు ఉండేవని ప్రస్తుతం 13 హాస్టళ్ళు పనిచేస్తున్నాయన్నారు. కోనాడ హాస్టల్‌ను గతంలో మూసి వేశారని దానిని పునరుద్ధరించాలని అసిస్టెంట్ బిసి సోషల్ వెల్ఫేర్ అధికారిని రాజులమ్మను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపి బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్ బాబు, నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పాన్ కార్డు ట్యాంపరింగ్

నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పాన్ కార్డును టిడిపి నాయకుడు ట్యాంపరింగ్ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. తన స్వగ్రామం మోపాడుకు చెందిన టిడిపి మాజీ ఎంపిటిసి బంటుపల్లి మురళీధర్‌రావు తన పాన్ కార్డును ట్యాంపరింగ్ చేశాడని అన్నారు. తన పాన్ కార్డు ద్వారా కారు కొనుగోలు చేశాడని చెప్పారు. పాన్ కార్డు ఫోటో టిడిపి నాయకుడు మురళీదని అందులో నెంబర్ మాత్రం తన పాన్ కార్డు నెంబరు ఏర్పాటు చేసి వాడుకుంటున్నాడని ఆరోపించారు. ఆడిట్‌లో ఈ విషయం బయటపడిందని తెలిపారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని స్పష్టం చేశారు.

జల జీవన్ మిషన్ పనులు ప్రారంభం

నెల్లిమర్ల: మండలంలోని మొయిద విజయరాంపురంలో జలజీవన్ మిషన్ పనులకు మంగళ వారం ఎమ్మెల్సీ డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు, ఎమ్మెల్యే బడ్డు కొండ అప్పల నాయుడు, శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటు చేసి తాగునీటిని అందిస్తామన్నారు. మొయిద విజయరాం పురంలో 550 గృహాలకు ఇంటింటికీ తాగు నీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు జన్మదినం సందర్భంగా వైసిపి నాయకులు, అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి మజ్జి శ్రీనివాసరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గదల సన్యాసి నాయుడు, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు చిక్కాల సాంబశివరావు, వైస్ ఎంపిపి పతివాడ సత్య నారాయణ, మొయిద పిఎసిఎస్ చైర్మన్ అట్టాడ కనకారావు స్థానిక సర్పంచ్ అట్టాడ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని రాయుడుపేట, బక్కునాయుడుపేట గ్రామాలలో మంగళవారం రాత్రి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మన రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్య మంత్రిగా గెలిపించుకోవాలన్నారు. దీని కోసం మనం అందరం కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షులు గుమ్మడి భారతి, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, రాయుడు పేట, బక్కు నాయుడుపేట టిడిపి నాయకులు, పాల్గొన్నారు.

తువ్వాళ్లు పంపిణీ

ప్రజాశక్తి- బొబ్బిలి

మథర్ తెరిస్సా వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో మదర్ తెరిసా ట్రస్ట్ కార్యాలయంలో 80 మందికి తువ్వాలు, భోజనం ప్యాకెట్లును అందించారు. బొబ్బిలి డిఎస్‌పి శ్రీధర్, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మి నాయుడు, కాంగ్రెస్ పిసిసి మెంబర్, బొబ్బిలి పట్టణ అధ్యక్షులు మువ్వల శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షలు ఎం పద్మావతి, యువజన నాయకులు మండపాక శ్రీనివాసరావు, 8 వ వార్డు ఇంచార్జ్ కుప్పిలి కృష్ణమాచారి పాల్గొన్నారు.

నాటుసారాపై అవగాహన

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండలంలోని జోగిందొరవలస గ్రామంలో నాటుసారా నివారణ గురించి 'ఆపరేషన్ పరివర్తన' అవగాహనా కార్యక్రమాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ జైభీమ్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రచార రథం ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ నాటుసారా తయారు చేసినా అమ్మినా కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రజలకు నాటుసారా తాగటం వల్ల కలిగే కష్ట, నష్టాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ చిన్నం నాయుడు, సిబ్బంది చంద్రప్రసాద్, ఆదినారాయణ, జయరాం, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

స్థానిక నారాయణాస్ కేంబ్రిడ్జి పాఠశాలలో కృష్ణాష్టమిని పురస్కరించికుని మంగళవారం ముందస్తు వేడుకలను ప్రిన్సిపాల్ పివిఎస్ఎస్ విశ్వనాధం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిల్లలు కృష్ణ, గోపిక వేషధారణలో వచ్చి ఉట్టి కొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ తిరుపతిరావు, ఏజియం శ్రీనివాసరావు, ఈఛాంప్స్ వైస్ ప్రిన్సిపాల్ ఏఎన్ఆర్ లక్ష్మీ, ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపాల్ రోజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా రాజశేఖర్

బొండపల్లి: నాడు తండ్రి, నేడు కొడుకు ఉప సర్పంచ్‌గా ఎన్నికైన సంఘటన బొండపల్లి మండలం దేవుపల్లి పంచాయతీలో చోటు చేసుకుంది. 2021లో దేవుపల్లి గ్రామ పంచాయతీలో జరిగిన ఎన్నికలలో 13వ వార్డు సభ్యునిగా ఎన్నికైన గాదం రాజశేఖర్ ఉప సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల ఆయన మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఆగస్ట్ 19వ తేదీన జరిగిన వార్డు సభ్యుని ఉప ఎన్నికలో గాదం రాజశేఖర్ కుమారుడు గాదం రాజేంద్ర కుమార్ టిడిపి మద్దతుతో గెలుపొందారు. దేవుపల్లి ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల నాల్గవ తేదీన అధికారులు నిర్వహించగా ఈ ఎన్నికలు గాదం రాజేంద్ర కుమార్ ఎన్నికయ్యారు. దేవుపల్లి పంచాయతీ చరిత్రలో తండ్రి కొడుకులు ఉప సర్పంచ్‌లు కావడం విశేషం.

ఘనంగా జెడ్‌పి చైర్మన్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - కొత్తవలస

జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజున పురష్కరించుకుని మంగళవారం స్థానిక తుమ్మికాపల్లిలో ఫర్ ద పీపుల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విశ్వనాథ హరికుమార్ ఆధ్వర్యంలో 40 మంది ఒంటరి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వారికి అన్నదానం చేశారు. కంటకాపల్లి సర్పంచ్ మదీనా అప్పల రమణ, చిన్నరావుపల్లి సర్పంచ్ భూసాల దేముడు, నిమ్మలపాలెం సర్పంచ్ కొట్యాడ శ్రీను, వైసిపి నాయకులు మదీనా ప్రకాష్ ఆర్థిక సహాయంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పాల్గొని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిస్ అధ్యక్షులు గొరపల్లి శివ, సీనియర్ నాయకులు మేలాస్త్రి అప్పారావు, వైస్ ఎంపిపి కర్రీ శ్రీను, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, పెనగంటి చెల్లయ్య, ట్రస్ట్ వైస్ చైర్మన్ సంతోష్ కుమార్, సభ్యులు గోవిందరావు వరహాలు నగేష్ ధర్మ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలను మండల కేంద్రంలోని ఎంపిపి కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి గేదెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తొలిత కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసిఎస్ కన్వీనర్ యడ్ల కిషోర్ కుమార్, సర్పంచులు మమ్ముున ప్రసాదరావు, ఆవాలు సత్యనారాయణ, ఎంపిటిసిలు బొడ్డు గణపతి, భూమిరెడ్డి స్వామినాయుడు, వైసిపి నాయకులు, పాల్గొన్నారు.

తెర్లాం: మండల ప్రజా పరిషత్ ఆవరణంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉమాలక్ష్మి, ఎఎంసి చైర్మన్ బి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి ఎస్ సత్యనారాయణ, వైసిపి మండల అధ్యక్షులు, సర్పంచులు పాల్గొన్నారు. పెరుమాలి వైసిపి కార్యకర్తలు బాణాసంచా కాల్చుతూ కేక్ కట్ చేస్తూ మిఠాయిలు పంచారు.

దెంకాడ: జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు మండలంలోని జొన్నాడలో నియోజవర్గ స్థాయిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి సురేష్ బాబు ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ప్రజల సమక్షంలో భారీ కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల ఎంపిపిలు, జెడ్‌పిటిసిలు, పార్టీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు పెద్దదిక్కుగా ప్రభుత్వం

ప్రజాశక్తి - జామి

పేదలకు పెద్దదిక్కుగా వైసిపి ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి ఒక్క పేదవాడు మళ్ళీ వైసిపిని ఆదరించాలని ఎమ్మెల్యే కడుబండి శీనివాసరావు అన్నారు. మంగళవారం జామి మండల పరిషత్ కార్యాలయంలో 209 మంది లబ్ధిదారులకి నూతన పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బవరపు అరుణ, మండల వైసిపి కన్వీనర్ గొర్లె రవికుమార్, స్టేట్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ సత్యారావు, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, జిల్లా ప్రచార కమిటీ చైర్మన్ రాజేశ్వర రావు, డిసిసిబి డైరెక్టర్ పాండ్రంకి సంజీవి, జామి మేజర్ సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, చింతాడ, విజినిగిరి సర్పంచ్ అప్పాన సుబ్రమణ్యం, సూర్యారావు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన పింఛన్లను మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని గొల్లపల్లిలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో వాలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వైసిపి జెండా మోస్తే బడ్డీ తొలగిస్తారా

మున్సిపల్ కో అప్షన్ సభ్యులు ఖాన్

ప్రజాశక్తి- బొబ్బిలి

వైసిపి ఆవిర్భావం నుంచి జెండా మోస్తే తన బడ్డి తొలగించడం సరికాదని మున్సిపల్ కో అప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ అన్నారు. టిటిడి కల్యాణ మండపం రోడ్డులో ఖాన్ ఏర్పాటు చేసిన బడ్డీను పోలీసులు సమక్షంలో మున్సిపల్ అధికారులు తొలగించారు. గతంలో టిటిడి రోడ్డులో ఉన్న బడ్డీలను మున్సిపల్ అధికారులు తొలగించిన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అనుమతితో మున్సిపల్ కో అప్షన్ సభ్యులు రియాజ్ ఖాన్ బడ్డీ అదే స్థలంలో పెట్టుకున్నారు. బడ్డి తొలగించాలని యోగా కేంద్రం నిర్వాహకులు ఎమ్మెల్యే శంబంగికు, మున్సిపల్ చైర్మన్ సావు మురళీకు, పోలీసులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన అధికార యంత్రాంగం క్రెయిన్ సహాయంతో బడ్డీను తొలగించేందుక ప్రయత్నించగా ఖాన్ బడ్డీకి ఉన్న వైసిపి ఫ్లెక్సీపై పెట్రోల్ పోషి నిప్పంటించి నిరసన తెలిపారు. బడ్డీకు అడ్డంగా బైఠాయించి బడ్డి తొలగింపున అడ్డుకునే ప్రయత్నం చేసినప్పటికీ అధికారులు బడ్డీను తొలగించారు. అనంతరం ఖాన్ మాట్లాడుతూ వైసిపి ఆవిర్భావం నుంచి జెండా మోసి పని చేస్తే తన కడుపు కొట్టడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చిన్న శ్రీను అనుమతితో పెడితే తొలగించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్ : ఫస్ట్‌ఫ్లోర్, పి.వి.ఎస్. ప్రైమ్, ఎ.జి. రోడ్, 3 లాంతర్ సెంటర్, విజయనగరం.
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2023 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 228.30 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
Cell : 8008812798

ప్రతి అక్షరం - ప్రజల పక్షం

ప్రజాశక్తి

తెలుగు దినపత్రిక

PRAJASAKTI 43 ANNIVERSARY 1981-2023

ప్రత్యేక అనుబంధం

విజయనగరం జిల్లా

బుధవారం 6-9-2023 | ఎస్.కోట డివిజన్ | 12 పేజీలు

చరిత్రాంతాన్ని గురించిన సిద్ధాంతాలు చెలరేగుతున్నప్పుడు సోషలిజం అజేయమని చెప్పడం... ప్రపంచీకరణ వేదమంత్రంలా మార్మోగుతున్నప్పుడు ప్రత్యామ్నాయాలకై వాదించడం... మతోన్మాదం మంటలు పెడుతున్నప్పుడు లౌకిక పతాకం ఎగరేయడం.. ఇవేవీ చిన్న విషయాలు కాదు. ఆశయ బలమే 'ప్రజాశక్తి'కి ఆ శక్తినిచ్చింది. రాజకీయ నైశిత్యం, ఉద్యమాల ఆలంబన, శ్రేయోభిలాషుల అండదండలు ఉంటే సంక్లిష్టమైన సవాళ్లను అధిగమించడం సాధ్యమని ప్రజాశక్తి గమనం నిరూపిస్తోంది.

ప్రజల పక్షాన అక్షర సమరం

దినదినాభివృద్ధి చెందుతున్న 'ప్రజాశక్తి' • ప్రజల ఆదరాభిమానాలే అండదండ

ప్రజాశక్తి నాలుగు దశాబ్దాలు పూర్తి చేసుకుని 43వ వార్షికోత్సవం జరుపుకొంటున్న సమయం. అక్షరాక్షర దీక్షగా.. ఆశయాలే రక్షగా.. నడచి వచ్చిన దారులు.. గడిచిపోయిన రోజులు... ఈ సందర్భంలో కళ్ల ముందు కదలాడతాయి. దానితో సన్నిహిత సంబంధం, భాగస్వామ్యం ఉన్న వారికి పత్రిక చరిత్ర, పెరుగుదల కళ్ల ముందు కదలాడతాయి. తెలుగులో పత్రికలు ప్రధానంగా సంఘ సంస్కరణలు, స్వాతంత్ర్య పోరాటం, వామపక్ష ఉద్యమాలు అన్న మూడు నేపథ్యాలలో తొలి అడుగులు వేశాయి. 1942లో ప్రజాశక్తి వార పత్రికగా ప్రారంభమైంది. ఆ విధంగా చూస్తే ఇది ఎనభయ్యవ వార్షికోత్సవం కూడా. ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడం లోను, ప్రగతిశీల భావాలను వ్యాపింప చేయడంలోనూ నాటి ప్రజాశక్తి కీలక పాత్ర వహించింది. 1945లో దినపత్రికగా మారింది. సుందరయ్య, కంభంపాటి, మద్దుకూరి వంటి వారి కృషి ఇందులో ఉంది. శ్రీశ్రీ, కొకు, ఉప్పల వంటి సుప్రసిద్ధుల రచనలు దానిలో వచ్చేవి. గ్రాంథికం, వ్యవహారం, వాదోపవాదాల మధ్య పత్రికా భాష ఇంకా పూర్తిగా స్థిరపడని ఆ కాలంలో జన సామాన్యానికి అర్థమయ్యే విధంగా రాయడంలో ప్రజాశక్తి భాషకు ఒరవడి, భావాలకు ఒరిపిడి అయింది. ఇది నచ్చని ఛాందసులు 'పెద్ద బాలశిక్ష ఫెయిల్-ప్రజాశక్తి పాస్' అని అపహాస్యం చేశారు కూడా! 1946లో ప్రారంభమైన తెలంగాణ రైతాంగ పోరాటానికి ప్రజాశక్తి వాణిగా పనిచేసింది. ప్రభుత్వం 1948లో ప్రజాశక్తి నగర్‌పై దాడి చేసి, విధ్వంసానికి పాల్పడింది. మళ్లీ ఆరేళ్లకు 1951లో వారపత్రికగా పున:ప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత దినపత్రికగా మారినా నాడు విశాలాంధ్ర కోసం జరుగుతున్న పోరాటాన్ని దృష్టిలో ఉంచుకుని పత్రికకు (మిగతా..2లో)



ప్రజల పక్షాన అక్షర సమరం

(మొదటి పేజీ తరువాయి)

కూడా అదే పేరు పెట్టారు. మద్దుకూరి చంద్రం, మోటూరు హనుమంతరావు తదితరులు దాని సంపాదకులుగా ప్రసిద్ధులు. ప్రజాశక్తి 1968లో వారపత్రికగా 1981 ఆగస్టు ఒకటవ తేదీన దినపత్రికగా అవతరించింది. మోటూరు హనుమంతరావు అధ్యక్షతన పుచ్చలపల్లి సుందరయ్య సమక్షంలో నాటి సిపిఎం కార్యదర్శి ఇఎంఎస్ నంబూద్రిపాద్ దాన్ని ఆవిష్కరించడం ఇంకా కళ్ల ముందు కదలాడుతున్నట్టుంది. చాలా మంది ఈ పత్రిక నడవటం కష్టమని అనేవారు. అటువంటి వారి సందేహాలు పటాపంచలు చేస్తూ అక్షరాయుధంగా నాలుగు దశాబ్దాల ప్రజా పాత్రికేయం ప్రజాశక్తి పదునెక్కుతూ ప్రజాశక్తి ప్రస్థానం నడిచింది. అంకిత భావం గల నాయకత్వం, పాత్రికేయులు, కార్మికులు సిబ్బంది సేవలు, ఉద్యమాభిమానులు పత్రిక శ్రేయోబిలాషుల అండదండలు దాన్ని నిలబెట్టాయి.

ఈ 43 ఏళ్ల కాలంలో అంతర్జాతీయంగానూ, దేశంలోనూ లౌకిక ప్రగతిశీల శక్తులు అనేక పోరాటాలు ఉద్యమాలు చేశాయి. అనేక ఎదురుదెబ్బలూ తగిలాయి. 1981 అఖిలపక్ష ఉద్యమం, 1982లో సిపిఎం అఖిల భారత మహాసభల మహా సమీకరణ తర్వాత 1983 ఎన్నికల్లో ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చారు. 1984లో సానుభూతి పవనాలతో రాజీవ్‌గాంధీ గద్దెనెక్కారు. 1990లలో సోషలిస్టు శిబిరంలో కల్లోలం చెలరేగి చివరకు 1991లో సోవియట్ యూనియన్ కూడా విచ్ఛిన్నమైంది. దేశంలో సరికొత్త ఆర్థిక విధానాలు, వాటి వెంటనంటి రాజకీయాలలో మితవాద, మతవాద దాడి మొదలైనాయి. చివరకు 1998లో బిజెపి అధికారం చేపట్టింది. రాష్ట్రంలో తెలుగుదేశం దానితో జత కట్టి మరోసారి అధికారంలోకి వచ్చి ప్రపంచబ్యాంకు విధానాలను అమలు చేయడంలో ప్రథమ పీఠిన నిలిచింది. పత్రికల మైండ్‌సెట్ మారాలని అప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతుండేవారు. ఆ సమయంలో సాగిన విద్యుచ్ఛక్తి ఉద్యమానికి ప్రజాశక్తి ప్రాణవాయువులా సేవచేసింది. ఆ ప్రభుత్వం మారి 2004లో వైఎస్ ప్రభుత్వం వచ్చాక భూపోరాటం వంటివి జరిగాయి. తర్వాత రాష్ట్ర విభజన ఉద్యమం మొదలైంది. 2014 ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాలైనాయి కూడా. కేంద్రంలోనేమో కరుడుగట్టిన మతతత్వం, కార్పొరేట్ తత్వం సామ్రాజ్యవాద అనుకూలతల కలయికగా మోడీ ప్రభుత్వం కొలువుదీరింది. ఈ దశలన్నింటా ప్రజాశక్తి ప్రజల కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం వేదికగా నిలిచింది. నిలుస్తోంది. ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతిరూపమైంది. విభజిత ఆంధ్రప్రదేశ్‌కే అంకితమైన పత్రిక ఇప్పుడు ప్రజాశక్తి ఒక్కటే కావడం విశేషం. అప్పుడూ ఇప్పుడూ పత్రికా పరంగానూ సిద్ధాంత పరంగానూ ప్రజాశక్తికే సొంతమైన ప్రత్యేకతలు చాలా ఉన్నాయి.

చరిత్రాంతాన్ని గురించిన సిద్ధాంతాలు చెలరేగుతున్నప్పుడు సోషలిజం అజేయమని చెప్పడం, ప్రపంచీకరణ వేదమంత్రంలా మార్మోగుతున్నప్పుడు ప్రత్యామ్నాయాలకై వాదించడం, మతోన్మాదం మంటలు పెడుతున్నప్పుడు లౌకిక పతాకం ఎగరేయడం చిన్న విషయాలు కాదు. ఆశయ బలమే ప్రజాశక్తికి ఆ శక్తినిచ్చింది. మోయలేని భారంగా మారిన పత్రికా నిర్వహణలో కొన్ని ప్రముఖ పత్రికలే ఆగిపోయాయి. ఆగినవాటిలో ఒక పత్రిక తప్ప వాటిలో మళ్లీ గట్టిగా బతికి బట్టకట్టినవి లేవు. నిన్నటి పెద్ద పత్రికలు కొన్ని ఇప్పుడు నామమాత్రంగా నడుస్తున్నాయి. హైదరాబాదులో రెండో ఎడిషన్ ఆలోచన అవాస్తవికమని చాలా మంది జోస్యాలు, జాగ్రత్తలు చెప్పారు. అలాంటి ప్రజాశక్తి నేడు ఎనిమిది ఎడిషన్లతో విస్తృతమైన యంత్రాంగంతో, రంగుల యంత్రాలతో ముందుకు పోవడం ఫలప్రదమైన ప్రయోగం. సమస్యలు లేవని కావు, వనరుల కొరత లేదనీ కాదు. ప్రస్తుత కరోనా తాకిడితో సహా చాలా సంక్లిష్ట సమస్యలే ఉన్నాయి. రాజకీయ నైశిత్యం, ఉద్యమాల ఆలంబన, శ్రేయోభిలాషుల అండదండలు ఉంటే సంక్లిష్టమైన సవాళ్లను అధిగమించడం సాధ్యమని ప్రజాశక్తి గమనం నిరూపిస్తుంది. సామాజిక మార్పులను, సాంకేతిక ప్రగతిని పరిగణనలోకి తీసుకుని ముందుకు పోవడంలోనే ఈ పురోగమన రహస్యం వుంది. సంస్కరణలు వాటికవే చెడ్డవి కావు. చెడ్డ సంస్కరణలే ప్రమాదకరమైనవి. ప్రజాశక్తి ఆ సూత్రాన్ని అన్వయించుకోవడం వల్లనే ప్రగతిశీల వాదులకు వేదిక కాగలిగింది. తమ మౌలిక అభిప్రాయాలకు కట్టుబడి ఉంటూనే లోగోతో సహా అనేక మార్పులు చేసుకుంది. శ్రమజీవుల ప్రయోజనాలను ప్రతిధ్వనిస్తూనే అందరి అభిప్రాయాలు, వార్తలు సముచితంగా ప్రచురిస్తుంది. సాంకేతిక వికాసంతో ఈ 43 ఏళ్లలో మీడియా ముఖచిత్రం ఎంతగానో మారింది.

ఆధిపత్య శక్తులకు అంగీకార సృష్టి నేటి ప్రపంచాధిపత్య వ్యూహంలో ప్రధానాంశం. ఇందులో పెద్ద పాత్ర మీడియాది. అందుకే ప్రజానుకూల శక్తులు ప్రత్యామ్నాయ మీడియా కోసం పెద్ద కృషి చేస్తున్నాయి. అమెరికా వంటి చోట్ల కూడా ప్రత్యామ్నాయ భావజాల కృషి ఉధృతమవుతున్నది. తెలుగు మీడియా ముఖ్యులలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో ప్రగతిశీల భావాల ప్రేరణ లేనివారు చాలా తక్కువ. కాని ఇప్పుడు భారతీయ మీడియాలో ఇంగ్లీషు లోనూ, తెలుగు లోనూ, సోషల్ మీడియా లోనూ కార్పొరేట్ శాసనం ప్రబలిపోయింది. ఆంక్షల అంకుశాలు, నిరంకుశ పాలకుల శాసనాలు (మిగతా..10లో)

అత్యున్నత లక్ష్యాలు... ఉన్నత విలువలు అంకితభావంతో...
విపత్కర పరిస్థితులను అధిగమించి... ప్రజాశక్తి అభివృద్ధికి కృషి చేస్తున్న
పాత్రికేయులకు, సిబ్బందికి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఎపి మోడల్ స్కూల్
మరియు సిబ్బంది, మదనాపురం - గంట్యాడ మండలం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

డి.ఆర్.డి.ఏ - వై.ఎస్.ఆర్.క్రాంతిపథం, విజయనగరం వారి ప్రగతి నివేదికలు

క్రమ సంఖ్య	కాంపోనెంట్ పేరు	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధిపొందిన మొత్తము
1	వై.యస్.ఆర్. పెన్షన్ కానుక	275682	రూ. 75.03 కోట్లు
2	వై.యస్.ఆర్. చేయూత	141347	రూ. 734.27 కోట్లు
3	వై.యస్.ఆర్. ఆసరా	350108	రూ. 640.27 కోట్లు
4	వై.యస్.ఆర్. సున్నావడ్డీ	430212	రూ. 119.82 కోట్లు
5	జగనన్న తోడు	61401	రూ. 61.40 కోట్లు
6	బ్యాంకు లింకేజి	25172	రూ. 3474.92 కోట్లు
7	స్త్రీనిధి	85443	రూ. 209.64 కోట్లు
8	ఉన్నతి	2635	రూ. 12.46 కోట్లు
9	రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (FPOs)	1423	రూ. 3.01 కోట్లు
10	సీడాప్ (SEEDAP)	853 1611	Training & Placement Direct Placement

ఎ.కళ్యాణ చక్రవర్తి
M.Tech
ప్రాజెక్టు డైరెక్టర్, డిఆర్‌డిఎ, వైకెపి
విజయనగరం

వైఎస్ఆర్ క్రాంతి పథం, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ
విజయనగరం జిల్లా

శ్రీమతి నాగలక్ష్మి.ఎస్
IAS
జిల్లా కలెక్టర్,
విజయనగరం

శృంగవరపుకోట అభివృద్ధికి ఎనలేని కృషి

నాలుగేళ్లలో నియోజకవర్గానికి సుమారు రూ.2500కోట్లు నిధులు విడుదల : ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు



అభివృద్ధి, సంక్షేమం రెండూ రెండు కళ్లలా వైసిపి ప్రభుత్వం పాలన అందిస్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తి 43 వార్షికోత్సవం సందర్భంగా జరిపిన ఇంటర్వ్యూలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నామన్నారు. గత నాలుగేళ్లలో కీలక సమస్యల పరిష్కారానికి కృషి చేశామని ఎమ్మెల్యే చెప్పారు. మరిన్ని విషయాలు ఆయన మాటల్లోనే..

ప్రజాశక్తి - జామి

ఎప్పటి నుంచో విశాఖ అరుకు రోడ్డు అభివృద్ధికి నోచుకోక, రోడ్డు ప్రమాదాల బారిన పడి ఎందరో మృతి చెందిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, రోడ్డు అభివృద్ధికి కృషి చేశాం. అందులో భాగంగానే రూ.20కోట్లు నిధులు మంజూరుకు కృషి చేశాం. కొత్తవలస ఆర్ఒబి నిర్మాణం పనులు చేపట్టాం. నియోజకవర్గంలో 7 పనులకు గానూ, రూ.11.90 కోట్లు నిధులు మంజూరు చేశాం. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో రూ.99 కోట్లు మంజూరు చేయించి, తాగునీటి సమస్య పరిష్కారానికి పాటుపడ్డాను. ఎస్.కోట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అభివృద్ధిలో భాగంగా 100 పడకల ఆస్పత్రి మంజూరు చేసి, పేదలకు ప్రభుత్వ వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చాం. నియోజకవర్గంలో 5 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నూతన భవనాలు మంజూరు చేయగా, రూ.8 కోట్లు నిధులతో వాటిని నిర్మిస్తున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా ఒక్క ఎస్కోట నియోజకవర్గంలోనే సంక్షేమం, అభివృద్ధి కోసం రూ.2500 నుంచి రూ.3వేల కోట్లు ఖర్చు చేశాం. ముఖ్యమంత్రి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పాలన సాగిస్తున్నారు. ప్రజాపక్షంగా సాగించాలన్న సంకల్పంలో భాగంగా ఎస్.కోటను అభివృద్ధి పథంలో నడిపేందుకు అహర్నిషలు కృషి చేస్తున్నాం. ప్రతి పేదవాడికి ఇల్లు అందిండమే ధ్యేయంగా పని చేస్తున్నాం. ప్రధానంగా పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రూ.364 పనులకు గాను రూ.113 కోట్లు ఖర్చు కాగా, ఆర్అండ్బి శాఖ ద్వారా 10 పనులకు రూ.52 కోట్లు విడుదలయ్యాయి. మరోవైపు గ్రామీణ నీటి సరఫరా శాఖ ద్వారా 583 పనులకు రూ.79 కోట్లు విడుదలయ్యాయి. విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి ప్రతి పేదవాడు ఉన్నతస్థాయికి ఎదిగేలా అధిక నిధులు కేటాయిస్తున్నాం. నియోజక వర్గంలో నాడు –నేడు కింద ప్రభుత్వ బడుల్లో 182 పనులకు రూ.35.5కోట్లు, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా 11 పనులకు రూ. 25.5 కోట్లు విడుదల చేశారు. ఇరిగేషన్ శాఖ ద్వారా 319 పనులకు రూ.39కోట్లు, గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 3138 పనులకు రూ.548కోట్లు ఖర్చు చేశాం. ఇలా నియోజకవర్గంలో సంక్షేమం, అభివృద్ధి పనులకు రూ.సుమారుగా 3వేల కోట్లు నిధులు కేటాయించాం

250 రోజులు దాటిన గడప గడప కార్యక్రమం

గడప గడప కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ప్రజల వద్దకు వెళ్లి వారి సాదక బాధకాలు తెలుకునేందుకు ముఖ్యమంత్రి చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎస్కోట ఎమ్మెల్యేగా నేను రాష్ట్రంలోనే ముందున్నాను. ఈ నేపథ్యంలోనే క్వాలిటీగా కార్యక్రమం నిర్వహించిన ఎమ్మెల్యేల్లో నేను రాష్ట్రంలోనే ఐదవ సభ్యుడును కావడం గర్వంగా ఉంది. నియోజకవర్గంలో 86,234 కుటుంబాలకు ఇప్పటి వరకు 58 వేల కుటుంబాలను గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా నేను నేరుగా వెళ్లి పలకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాను. గ్రామాల్లో ప్రధాన సమస్యలు గుర్తించి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నాం. ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా పరిష్కరించేందుకు నా తలుపులు ఎల్లప్పుడూ తెరుచుకునే ఉంటాయని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు.

నాలుగేళ్లలో నియోజకవర్గ అభివృద్ధి

అభివృద్ధి పని	పనుల సంఖ్య	నిధులు (కోట్లు)
నూతన సచివాలయాలు	104	రూ.37.85
సిసి రోడ్లు	102	రూ.35.77
రైతు భరోసా కేంద్రాలు	97	రూ.21.14
వెల్ నెస్ సెంటర్లు	85	రూ.14.88
బల్క్ మిల్క్ సెంటర్లు	96	రూ.15.50
డిజిటల్ లైబ్రరీలు	41	రూ.6.56
	మొత్తం :	రూ.131.70

సంక్షేమ పాలన ప్రజల గుండెల్లో సుస్థిరం

నియోజకవర్గంలో విద్య, వైద్యానికి పెద్దపీట : గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

అధికారం చేపట్టినప్పటి నుంచి నిరంతర సంక్షేమ పథకాలు అందిస్తూ, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, ఈ నాలుగేళ్లలో ప్రజల మన్ననలు పొందుతూ వారి గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించామని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య పేర్కొన్నారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవం సందర్భంగా ఇంటర్వ్యూ ఇచ్చిన ఆయన తన రాజకీయ, జీవిత విశేషాలను వివరించారు. వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రజాశక్తి -జామి

జిల్లాలోనే గజపతినగరం నియోజకవర్గం ఒక వెనుకబడిన ప్రాంతం. రహదారులు, తాగునీరు, మౌలిక సదుపాయాలకు నోచుకోని గ్రామాలు ఎక్కువ. నేను 2001లో జెడ్పిటిసి సభ్యునిగా ఎన్నికైన నుంచి ఈ ప్రాంత అభివద్ధికి అహర్నిశలూ కష్టపడుతున్నాం. 2009లో ఎమ్మెల్యేగా ప్రజలు ఎన్నుకున్నారు. మంత్రి బొత్స సత్యనారాయణ సహకారంతో నియోజకవర్గ ప్రజలకు, ప్రాంత అభివృద్ధికి ఎన్నో పనులు చేశాం. రక్షిత మంచినీటి వనరుల ఏర్పాటుకు జామి, గంట్యాడ, బొండపల్లి, గజపతినగరం మండలాల్లో పైలెట్ ప్రాజెక్టులు తీసుకొచ్చాం. నేడు జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటి కుళాయిలు ఇవ్వగలుగుతున్నామంటే ఆ రోజు చేపట్టిన ప్రాజెక్టులే కీలకంగా మారాయని చెప్పక తప్పదు. నేడు నియోజకవర్గంలో దాదాపుగా అన్ని రహదారులూ పూర్తి చేయడంతోపాటు మరమ్మతులు చేపట్టి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందించగలిగాం. రూ.150 కోట్లతో జాతీయ రహదారి నిర్మాణం, రూ.10 కోట్లతో గొట్లాం నుంచి గజపతినగరం రహదారి, రూ.4 కోట్లతో భీమసింగి, కొత్తవలస రహదారి.. ఇలా దాదాపుగా రోడ్ల నిర్మాణాలు పెద్దఎత్తున చేపట్టాం.

నియోజకవర్గ అభివృద్ధి పైనే దృష్టి

ఎమ్మెల్యేగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ, జగన్ మూడేళ్ల పాలనలో ప్రజల ఆర్థిక పరిపుష్టికి అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతో సంతృప్తిని ఇస్తున్నాయి. పేదల ఖాతాల్లోకి నేరుగా నిధులు పంపడం అంటే, అది సామాన్యమైన విషయం కాదు. పెద్ద మొత్తాల్లో ప్రజలకు నిధులు ఇవ్వడం అంటే, వారి అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలవడమే. ప్రధానంగా విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. గజపతినగరం నియోజకవర్గంలో అత్యధిక స్కూళ్లను నాడు - నేడు నిధులతో అభివృద్ధి చేశాం. ప్రతి మండలంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు ఎంతో ఆదర్శంగా నడుస్తున్నాయి. పేద ఇళ్లల్లో ఆడపిల్లలు చదువులకు దూరమై, వలసలకు వెళ్లేవారు. కానీ నేడు పరిస్థితి మారింది. ప్రతి పేదింటి పిల్లలు కెజిబివిల్లో పోటీ పడి చదవడమే అందుకు నిదర్శనం. జిల్లాకో మెడికల్ కాలేజీ, మండలానికో జూనియర్ కాలేజీ, ప్రభుత్వ బడుల్లో ఇంగ్లీష్ మీడియం అందిస్తున్నాం. గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రి స్థాయిని పెంచి, వైద్యానికి నియోజకవర్గం దాటకుండానే ప్రభుత్వం వైద్యం అందిస్తున్నాం. ప్రతి పిహెచ్‌సిలో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నాం. 'ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్' ద్వారా గ్రామాల్లోకి వైద్యులను పంపి, ప్రజా వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. సచివాలయంలోనే ఆధార్, మీసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశాం. ఇలా ఒకటేమిటి, అన్ని విషయాల్లో ప్రభుత్వం ముందుచూపుతో ఆలోచన చేస్తుంది.

జనాలను అంటిపెట్టుకుని ఉండాలి

రాజకీయ జీవితంలో అనుక్షణం జనాల్లోనే ఉన్నాను. నేడు ముఖ్యమంత్రి కూడా ప్రతి నాయకుడూ జనాల్లో ఉండాలని గడపగడపకూ పంపుతున్నారు. కరోనాతో రెండేళ్లపాటు జనాలకు దూరమయ్యాం. కాబట్టి గడపగడప ప్రభుత్వం కార్యక్రమం ద్వారా జనాల్లోకి వెళుతున్నాం. ప్రజా సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేశాం తప్ప వ్యక్తిగత, రాజకీయ స్వప్రయోజనాలను ఎన్నడూ పట్టించుకోలేదు. కాబట్టి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించగలిగాం. నాకు ప్రజలే ముఖ్యం. నమ్ముకున్న కేడర్‌కి, నియోజకవర్గ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, సేవ చేయడమే నాయకత్వానికి నిజమైన నిర్వచనం. జగన్ ప్రభుత్వంలో మరోసారి ప్రజలకు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నాను.

నియోజకవర్గంలో పరిష్కారం కానీ సమస్యలెన్నో?

పాలకులు దృష్టి పెడితే అభివృద్ధి ఫలాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

నియోజకవర్గంలోని నేటికీ ఎన్నో సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆధ్వర్యాన పలు అభివృద్ధి పనులు చేపట్టినప్పటికీ ఇంకా పరిష్కారాని సమస్యలు ప్రజలను వెంటాడుతున్నాయి.

ప్రధానంగా పెందుర్తి నుండి కొత్తవలస, లక్కవరపుకోట, శృంగవరపుకోట మీదుగా బొడ్డవర వద్ద ఏజెన్సీ ముఖద్వారంగా ఉన్న అరకు వెళ్లే రహదారిని కలిపే రహదారిని నాలుగు లైన్లుగా తీర్చి దిద్దుతామని ఇచ్చిన హామీలు నేటికీ ఒక్క అడుగైనా ముందుకు సాగలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం జామి, లక్కవరపుకోట మండలాల ప్రజలు ఎప్పటినుంచో పోరాటం చేస్తున్నా, ప్రభుత్వ కళాశాల మంజూరు కలగానే మిగిలిపోయింది.

మూడు, మూడేళ్లగా నత్త నడకన సాగుతున్న వంద పడకల ప్రభుత్వాసుపత్రి.

జూనియర్ కళాశాల మంజూరు కాకపోవడంతో ఈ మండలానికి చెందిన విద్యార్థులు విజయనగరం, శృంగవరపుకోట, విశాఖ పట్టణానికి పోయి చదువుకోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.

వేలాది మంది చెరకు రైతులకు నష్టం కలిగించేలా భీమసింగి సహకార చక్కెర ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం ముసేయడం నియోజకవర్గ రైతులకు, ఫ్యాక్టరీ కార్మికులకు తీరని లోటు. వీటితో పాటే తాతతండ్రుల నుండి సాగు చేసుకుంటున్న జామి అగ్రహారం భూములను సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారు. కొత్తవలస, జామి, వియ్యం పేట, లక్కవరపుకోట, కొట్టం, అలమండ, బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అరకొర వసతులతోనే నడుస్తున్నాయి. నియోజకవర్గంలోని రైతు భరోసా కేంద్రాలు వెల్నెస్ సెంటర్లో గ్రామ సచివాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్ని భవనాలు సిద్ధమైనప్పటికీ వర్గ విభేదాల వలన, బిల్లులు చెల్లించలేదని అవి ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో నియోజకవర్గంలోని కొన్ని గ్రామాల్లో చాలీ చాలని గదులలో సచివాలయ సిబ్బంది విధులను నిర్వర్తిస్తున్నారు. వేపాడ మండలంలోని గల గిరిజన గ్రామమైన మారిక రహదారి సౌకర్యం కూడా పూర్తిస్థాయిలో కలగలేదు. మరికొన్ని గిరిజన గ్రామాలైన చిన్న దుంగాడ, పెద్ద దుంగాడ, కేజీ పూడి పంచాయతీ పరిధిలో గల తొమ్మిది గిరిజన గ్రామాలకు పూర్తిస్థాయిలో రహదారి సౌకర్యంతో పాటు ఆయా గ్రామాలలో కనీస మౌలిక సౌకర్యాలు కూడా ఏర్పాటు కాలేదు. శృంగవరపుకోట మండలంలోని దారపర్తి పంచాయతీ పరిధిలో గల 12 గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యంతో పాటు మంచినీరు వంటి కనీస సౌకర్యాలు లేక గిరిజనులు కొండ ప్రాంతాలలో ప్రవహించే సెలయేళ్లపై ఆధారపడవలసిన పరిస్థితి ఏర్పడింది. దీంతో గిరిజనులు అనారోగ్యం పాలవుతున్నారు. రహదారులు లేకపోవడంతో ఈ పంచాయతీ పరిధిలో నెలలో కనీసం ఒకటి రెండు డోలీమోతలు ఈ ప్రాంత గిరిజనులకు తప్పనిసరిగా మారాయి. మార్గమధ్యంలో ప్రాణాలు పోయిన పరిస్థితులు కూడా కోకొల్లలు.

కొత్తవలస మండలంలోని శారద, జిందాల్ లక్కవరపుకోట మండలంలోని గోల్డ్ స్టార్, మహా మాయ కంపెనీలు వెదజల్లుతున్న కాలుష్యంతో ఈ కంపెనీలకు చుట్టుపక్కల ఉన్న పదుల సంఖ్యలో గ్రామాలు కాలుష్యం బారిన పడి ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ కంపెనీల యాజమాన్యాలు కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించకుండా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నియోజకవర్గంలో జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులు ఉన్నప్పటికీ వారికి క్రీడలలో తర్ఫీదు ఇచ్చేందుకు

(మిగతా 6లో....)

సరైన మైదానాలు గాని శిక్షకులు గాని లేకపోవడంతో క్రీడాకారులు వారి ప్రతిభను ప్రదర్శించలేక గ్రామస్థాయి క్రీడాకారులుగానే మిగిలిపోతున్నారు.

నియోజకవర్గంలో పరిష్కారం కానీ సమస్యలెన్నో?

కాలుష్యం వెదజల్లుతున్న మామహామాయ కంపెనీ

(5వ పేజీ తరువాయి)

సరైన మైదానాలు గాని శిక్షకులు గాని లేకపోవడంతో క్రీడాకారులు వారి ప్రతిభను ప్రదర్శించలేక గ్రామస్థాయి క్రీడాకారులుగానే మిగిలిపోతున్నారు.

పెండింగ్ పనులు పూర్తయ్యేనా?

నియోజకవర్గంలో గల గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెలెనెస్ సెంటర్ల నిర్మాణాలు ఈ ప్రభుత్వ పూర్తవుతాయో లేదోనని నియోజకవర్గ ప్రజలు ఆందోళన చెందుతున్నారు వీటితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, నాడు- నేడు ఫేస్ 2లో ఎంపికైన పాఠశాలల్లో సకాలంలో నిర్మాణాలు జరగాల్సి ఉన్నప్పటికీ ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పలు ప్రభుత్వ కార్యాలయాలు, వసతి గృహాలు, శిథిలావస్థకు చేరినప్పటికీ వాటికి నిధులు మంజూరు చేయడంలో గాని, పనులు ప్రారంభించడంలో గాని ఆలస్యం వల్ల అధికారులు, విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

సాగునీటి సమస్యలు ఎన్నటికి తీరేనో?

వేపాడ మండలంలోని భూములకు రైవాడ రిజర్వాయర్ నీటిని సాగుకు కేటాయించాలని ఎన్నో ఉద్యమాలు చేసినప్పటికీ అధికారులు హామీలు అమలుకు నోచుకోలేదు. విజయరామ సాగర్ ప్రాజెక్టు నిర్మాణం కోసం 2003 సంవత్సరంలో అప్పటి చిన్న తరహా నీటిపారుదల శాఖమంత్రి కెఇ ప్రభాకర్ శంకుస్థాపన చేయగా శంకుస్థాపన చేసిన శిలాఫలకం నేటికీ శిల గానే మిగిలిపోయింది. అదే మండలంలో వీలు పర్తి పంచాయతీ పరిధిలో మినీ రిజర్వాయర్ నిర్మాణానికి విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి తులసీరావు రూ.6 కోట్ల నిధులు మంజూరు చేశారు. రిజర్వాయర్ నిర్మాణం కోసం అప్పటి జిల్లా కలెక్టర్ ఎంఎం నాయక్ పరిశీలన కూడా చేశారు. రిజర్వాయర్ పూర్తయితే వేపాడ మండలం తో పాటు లక్కవరపుకోట మండలంలో సాగు భూములు సస్యశ్యామలంగా మారుతాయి.

భూ సేకరణ నిలుపుదల చేయాలి

ఇప్పటికే గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం భూములు కోల్పోయి ఉన్న రైతులపై మూలిగే నక్కపై తాటి పండు పడ్డట్లు పోలవరం ఎడమ కాలువ కోసం మరికొంత భూమిని కోల్పోవాల్సి వచ్చింది. పోలవరం ఎడమ కాలువ డిజైన్ మార్చాలని, 2013 చట్టం ప్రకారం భూసేకరణకు చర్యలు చేపట్టాలని, భూములు పోతున్న రైతులకు భూమికి బదులు భూమి ఇవ్వాలని ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన ఉద్యమాలు జరిగాయి. రైతాంగానికి ఎటువంటి సమాధానం చెప్పకుండా పచ్చటి పంట పొలాల్లో సర్వే చేపట్టడం సరికాదు. నియోజకవర్గంలోని పోలవరం కాలువ నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతుల డిమాండ్లను పరిశీలించి వెంటనే జిల్లా అధికారులు గ్రామ సభలు పెట్టి రైతులకు నష్టపరిహారం పై, డిజైన్ మార్పు పై స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. గ్రామాలకు దూరంగా విశాల ప్రాంతాలలో ఉన్న వసతి గృహాలకు నేటికీ సరైన ప్రహరీల నిర్మాణం లేకపోవడం. ప్రహరీలు నిర్మించిన వసతి గహాలలో చెట్లు, ముళ్ళ తుప్పలు పెరిగి విపరీతమైన విష సర్పాలు కీటకాలు వలన విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. వసతి గహాలకు వెంటనే పరిహారీల నిర్మాణాలు చేపట్టి 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభానికి అభివృద్ధి చేయాలని విద్యార్థులు కోరుకుంటున్నారు.

వికలాంగుల ఆపద్బాంధవుడు.. రాపర్తి

శ్రీగురుదేవ్ ఆస్పత్రి

- శ్రీగురుదేవ్ చారిటబుల్ ట్రస్టు ద్వారా పేదలను ఆదుకుంటున్న జగదీశ్‌బాబు
- 90 వేల మందికి కృత్రిమ అవయవాలు పంపిణీ
- 25 పడకల ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు

ఆయన వికలాంగుల ఆపద్బాంధవుడు. వారికి ఆరాధ్య దైవం. నిరుపేదలకు నిస్వార్థంగా సేవలందిస్తూ స్వయం ఉపాధి కల్పించి ఆదుకుంటున్న మానవతామూర్తి. ఆయనే రాపర్తి జగదీశ్‌బాబు. కొత్తవలస మండలం మంగళపాలెం అనే కుగ్రామంలో 20ఏళ్ల క్రితం వికలాంగులకు, పేద ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి నేటికి 90 వేల మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి ఆదుకున్నారు.

ఆస్పత్రి ప్రారంభోత్సవానికి హాజరైన కేంద్ర మాజీ మంత్రి సారంగి, ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - కొత్తవలస

ఆయన వికలాంగుల ఆపద్బాంధవుడు. వారికి ఆరాధ్య దైవం. నిరుపేదలకు నిస్వార్థంగా సేవలందిస్తూ స్వయం ఉపాధి కల్పించి ఆదుకుంటున్న మానవతామూర్తి. ఆయనే రాపర్తి జగదీశ్‌బాబు. కొత్తవలస మండలం మంగళపాలెం అనే కుగ్రామంలో 20ఏళ్ల క్రితం వికలాంగులకు, పేద ప్రజలకు సేవలందించాలనే లక్ష్యంతో శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి నేటికి 90 వేల మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అందించి ఆదుకున్న ఆపద్బాంధువుడు జగదీష్‌బాబు. తన తల్లి సుబ్బలక్ష్మి అడుగుజాడల్లో నిస్వార్థంగా సేవలందిస్తున్న సేవకుడు జగదీష్. ప్రమాదవశాత్తు రైళ్లు, రోడ్డు ప్రమాదాల్లో కాళ్లు, చేతులు పోగొట్టుకుని జీవితాలు అంధకారమైపోయాయన్న బాధలో నిరాశ, నిస్పృహల మధ్య జీవనం వెళ్లదీస్తున్న వారి జీవితాల్లో కొత్త ఆశలు చిగురింపజేసి ముందుకు నడిపిస్తున్నారు. వికలాంగులపై అపారమైన ప్రేమ, మానవసేవే మాధవసేవ. అన్న ఓ చిన్న ప్రేరణే జగదీష్‌బాబును సేవా మార్గంలో నడిపించాయి. గోదావరి పుష్కరాల్లో జరిగిన సంఘటనలో కాళ్లు పోగొట్టుకున్న వ్యక్తులకు ఆశ్రయం కల్పించి, కృత్రిమ అవయవాలు అందించి ఉపాధి కల్పించి ఆదుకున్నారు. సంపన్న కుటుంబానికి చెందిన జగదీష్‌బాబు వృత్తి రీత్యా ఇంజనీరింగ్ పూర్తిచేసి మరికొన్ని రోజుల్లో విదేశాలకు పయనమయ్యే తరుణంలో తన స్నేహితునికి ప్రమాదవశాత్తు కాలు

శ్రీగురుదేవ్ ట్రస్టు ద్వారా వికలాంగులకు కృత్రిమ అవయవాలు పంపిణీ చేస్తున్న జగదీశ్‌బాబు

విరిగింది. తన స్నేహితుడికి కృత్రిమ అవయవాలు వేయించడంలో కలిగిన కష్టం మరెవరూ పడకూడదని భావించారు. ప్రమాదాలు, వివిధ కారణాలతో కాళ్లు, చేతులు కోల్పోయిన వారు, పుట్టుకతో వైకల్యం పొందిన పలువురు చిన్నారులను చూసి చలించిపోయిన జగదీష్ తొలుత మంగలపాలెంలో కృత్రిమ అవయవాల తయారీకొరకు కొలతలు సేకరించి జైపూర్, హైదారాబాద్‌లో తయారు చేయించి ఉచితంగా అందజేసేవారు. అనతి కాలంలోనే మరింతమంది వికలాంగులకు అనుకూలంగా ఉండడంతో వంద నుంచి వేలాది మందికి పెరిగారు. అతి తక్కువ సమయంలోనే ఆయన సేవలు రాష్ట్ర సరిహద్దులు దాటాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాల్లోని మహానగరాల్లో శిబిరాలు నిర్వహించి మూడేళ్ల చిన్నారి నుంచి 70 ఏళ్ల ముదుసలి వరకూ సుమారు 90 వేల మందికి పైగా వికలాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను అందజేశారు. అత్యాద్మిక, ధార్మిక సేవా కార్యక్రమాల్లో శ్రీగురుదేవ చారిటబుల్ ట్రస్టు తనదైన ముద్రను వేసుకుంది. గ్రామాల్లో ఆలయాల నిర్మాణాలకు విరాళాలివ్వడం, గిరిజన గ్రామాల్లో వారి జీవనశైలిని మెరుగుపర్చేలా కృషి చేయడం, నిరుపేదలకు బియ్యం పంపిణీ, అంథులకు ఫించన్లు ఇవ్వడం వంటి సేవా (మిగతా 8లో....)

అక్షర సత్యాలతో అభ్యుదయ భావాలతో...
ప్రత్యామ్నాయ పత్రికగా ముందుకు వెళ్తున్న
"ప్రజాశక్తి"కి 43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
మధు మహేష్
ఎపిఎం, జామి మండలం
మరియు సిబ్బంది
వైఎస్ఆర్ క్రాంతి పథం - జామి మండలం

ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ
శుభాకాంక్షలు
'ప్రతి అక్షరం - ప్రజల పక్షం' అనే నినాదంతో
పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాలకు,
కార్మికులకు అండగా ఉంటూ...
నిరంతరం ప్రజల పక్షాన నిలబడుతూ...
అందరి మన్ననలు పొందుతున్న ప్రజాశక్తి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

హేమంత్ కుమార్
తహశీల్దార్, జామి
డిప్యూటీ తహశీల్దార్
మరియు సిబ్బంది
జామి మండలం

వార్షికోత్సవ
శుభాకాంక్షలు

అత్యున్నత లక్ష్యాలు...
ఉన్నత విలువలు అంకితభావంతో...
విపత్కర పరిస్థితులను అధిగమించి...
ప్రజాశక్తి అభివృద్ధికి కృషి చేస్తున్న
పాత్రికేయులకు, సిబ్బందికి
43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
కొవ్వాడ కిశోర్‌కుమార్
ఎంపిడిఓ, గజపతినగరం
మరియు సిబ్బంది ఎంపిడిఓ కార్యాలయం
గజపతినగరం, విజయనగరం జిల్లా.

అత్యున్నత లక్ష్యాలు... ఉన్నత విలువలు అంకితభావంతో...
విపత్కర పరిస్థితులను అధిగమించి...ప్రజాశక్తి
అభివృద్ధికి కృషి చేస్తున్న పాత్రికేయులకు, సిబ్బందికి
ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
వి.వి.కృష్ణమూర్తి
ఇరిగేషన్ మండల ఇంజినీరింగ్ అధికారి,
జామి మండలం

విజయరామ సాగర్ పూర్తయ్యేదెప్పుడు?

ప్రజాశక్తి-వేపాడ

సుమారు 30 ఏళ్లు కావస్తున్నప్పటికీ విజయరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వాలు మారినప్పుడల్లా శంకుస్థాపన చేయడమే తప్ప పనులు చేపట్టేందుకు నిధులు విడుదల చేయడం లేదు. వేపాడ మండలం కొండగంగుబూడి రెవెన్యూ పరిధిలోని విజయ రామ సాగర్ నిర్మాణానికి పలు రాజకీయ పార్టీలు శంకుస్థాపనలు చేసి నేటికి 30ఏళ్లు అవుతుంది. విజయనగరం, విశాఖ జిల్లాల సరిహద్దు ప్రాంతంలో రెండు కొండల మధ్య ప్రవహిస్తున్న ఇసుక గెడ్డకు అడ్డంగా ఈ ప్రాజెక్టును నిర్మించతలపెట్టారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో శృంగవరపుకోట, వేపాడ, లక్కవరపుకోట మండలాల రైతులకు సాగునీరు అందించే ఉద్దేశంతో 1981 జనవరి 9న ఈ ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి నీటిపారుదలశాఖా మంత్రి గొర్లె శ్రీరాములునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత నీటిపారుదలశాఖా మంత్రి కెఇ ప్రభాకర్ విజయరామసాగర్‌ను పరిశీలించి ప్రారంభోత్సవం చేశారు. రూ.70లక్షలు కేటాయిస్తామని చెప్పారు. కానీ కార్యరూపం దాల్చలేదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే సుమారు 10వేల ఎకరాల భూములు సస్యశ్యామలమవుతాయి. ఈ జలాశయం పథకం నుండి వేపాడ, శృంగవరపుకోట, ఎస్.కోట, సీతారాంపురం, కృష్ణరాజపురం, జాకేరు, పాటూరు, సోంపురం, ముకుందపురం, కల్లెంపూడి గ్రామాల ఆయకట్టు దారులకు సాగునీరు అందించాలని అప్పట్లో నిర్ణయించారు.

1980 -81లో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 5.92 లక్షలు కేటాయించగా, అందులోకేవలం రూ.5లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. నిధులు లేకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయి, రెండో విడత గ్రాంటు కింద 1993-94లో రూ.8లక్షలు మంజూరు చేయగా అందులో కేవలం 5లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. విజయ రామసాగర్ నుంచి సుమారు 23 చెరువులకు నీరు అందించవచ్చు. తద్వారా సుమారు 10వేల ఎకరాలకు నీరందించి ఈ ప్రాంతం సస్య శ్యామలం కానుంది. ఏడాదికి మూడు పంటలు పండే అవకాశం ఉంది. కానీ పాలకుల నిర్లక్ష్యం కారణంగా నిధులు కేటాయించగా, పనులు చేపట్టకపోవడంతో ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్న చందంగా ఉంది. ఈప్రాంతం పూర్తిగా వర్షాధారం కావడంతో రైతులు ఏటా పంటలు పండక తీవ్ర నష్టాలకు గురవుతున్నారు. ప్రాజెక్టుకు అప్పటి విశాఖ డెయిరీ చైర్మన్ అడారి తులసీరావు నిధులు మంజూరు చేస్తామని 2001లో ఈ ప్రాజెక్టును సందర్శించిన నేపథ్యంలో ప్రకటించారు. అదే ఏడాది ఏప్రిల్ 20న అప్పటి జిల్లా కలెక్టర్ హరిప్రీత్‌సింగ్ సందర్శించి నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. టిడిపి ఎమ్మెల్యేగా పనిచేసిన శోభా హైమావతి కృషితో అప్పటి నీటిపారుదల

శాఖా మంత్రి కెఇ ప్రభాకర్ 2001 మే 1న ఈ ప్రాజెక్టును పరిశీలించి రూ.70లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తాజా అంచనాలను పంపాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల్లో నిధులు మంజూరు చేస్తున్నట్లు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారు. అయినా హామీలు అమలుకు నోచుకోలేదు. ప్రస్తుత ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అయినా దృష్టి సారించి నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వికలాంగుల ఆపద్బాంధవుడు ... రాపర్తి

(7వ పేజీ తరువాయి)

కార్యక్రమాలతో ప్రముఖుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. పలువురు వికలాంగులు తమ ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వారిలానే వచ్చే మరింత మందికి సేవ చేయాలనే దృఢ సంకల్పంతో మంగళపాలెంలోనే నెలకొల్పిన తయారీ యూనిట్లోనే పనిచేస్తూ ఉపాధిని పొందుతున్నారు మహిళలకు టైలరింగ్ విభాగంలో నైపుణ్య శిక్షణనిచేందుకుగానూ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

పేదల కోసం శ్రీ గురుదేవ్ ఆసుపత్రి సేవలు

ట్రస్ట్ ఆవరణలో పేదలకు సేవలతో పాటు మంచి ఆరోగ్యం అందించాలన్న లక్ష్యంతో అన్ని రోగాలకు ఉచితంగా వైద్య సేవలందించాలనే

తల్లి సుబ్బలక్ష్మితో రాపర్తి జగదీశ్‌బాబు

సదుద్దేశ్యంతో ఇటీవల 25 పడకల ఆసుపత్రిని ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారు. ఈ ఆసుపత్రిని 2021 జూలై 11న కేంద్ర మాజీమంత్రి ప్రతాప్ చంద్ర సారంగి, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రారంభించారు. తన తల్లి సుబ్బలక్ష్మమ్మ ఆశీస్సులతో సుమారు రూ.5కోట్ల మూలధనంతో 25 పడకల ఆసుపత్రిని నిర్మించి శస్త్రచికిత్సలతో పాటు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సాధారణ సేవలు, గైనిక్, చిన్నపిల్లలు, ఎముకలు, కార్డియాలజీ, దంత, కంటివైద్య సేవలందిస్తున్నారు. ప్రతి ఆరు నెలలకు సేవలు విస్తరించి, భవిష్యత్తులో 100 పడకల ఆసుపత్రిగా విస్తరించి పుట్టపర్తి సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిగా తీర్చిదిద్దాలని తన జీవితకాల ఆశయమని అన్నారు.



ఆధ్యాత్మిక శైవ క్షేత్రం పుణ్యగిరి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పుణ్యగిరి ప్రముఖ శైవక్షేత్రంగా పేరుగాంచింది. ఇటు ప్రకృతి రమణీయతకు, అటు ఆధ్యాత్మిక శోభకు ఆలవాలం ఈ క్షేత్రం. ఈ క్షేత్రంలో గల శివలింగాన్ని నిత్యం అభిషేకిస్తూ వస్తున్న జలధారలో స్నానమాచరించి ఉమా కోటిలింగేశ్వరస్వామిగా వెలసిన పరమేశ్వరుణ్ని దర్శించుకుంటే సర్వపాపాలు వైదొలగుతాయని భక్తుల నమ్మకం. ఈ క్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సావాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ క్షేత్ర పరిసరాలన్నీ శివనామస్మరణతో మార్రోమోగిపోతాయి. పరమేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తజనులతో పుణ్యగిరి ఉమా కోటిలింగేశ్వర స్వామి ఆలయ పరిసర ప్రాంతం కిక్కిరిసిపోతుంది.

పుణ్యగిరి పరమ పవిత్రమైన క్షేత్రం. పచ్చటి ప్రకృతి మధ్య కొండలపై పరమేశ్వరుడు ఉమా కోటిలింగేశ్వరస్వామిగా వెలసి భక్తుల నీరాజనాలందుకుంటున్న అద్భుత పుణ్యక్షేత్రం. ఎత్తయిన కొండలు, వాటి మధ్యలో జలజలపారే జలపాతాలు, అంబరాన్నంటే వృక్ష సముదాయంతో కనువిందు చేసే పచ్చటి ప్రకృతి మధ్య ఉంది పుణ్యగిరి ఆలయం.

పాండవులు నడయాడిన భూమిగా పుణ్యగిరి

మహాభారత కాలంలో పాండవులు కౌరవులతో పాచికలాటలో ఓడిపోయి ఆటలోని నిబంధనల ప్రకారం అరణ్యావాసం, అజ్ఞాతవాసం చేయాల్సి వచ్చింది. అరణ్యావాసం ముగించుకొని అజ్ఞాతవాసం చేస్తున్న సమయంలో ఈ కొండలపైనే గడిపినట్టు ఆలయ చరిత్ర చెబుతోంది. ఆ సమయంలో ఇక్కడ పుణ్యగిరి కొండపై విరాటరాజుకోట ఉండేదని ఆ కోటలోనే పాండవులు అజ్ఞాతవాస సమయంలో తలదాచుకున్నారని అప్పుడు ప్రతిరోజు ఇక్కడ జలధారలతో స్నానం చేసి పరమేశ్వరుడ్ని పూజించేవారని చెప్తారు. ఈ పుణ్యగిరి క్షేత్రంలో వెలసిన కోటిలింగాలు, త్రినాథ గుహ, ధారగంగమ్మ జలపాతం అతి ముఖ్యమైన దర్శనీయ స్థలాలుగా పేరుపొందాయి.

పుణ్యగిరిలో ప్రముఖంగా దర్శించాల్సిన పుణ్యస్థలం ధార గంగమ్మ లోవ. పుణ్యగిరికి కొండపై గల శ్రీ ఉమా కోటిలింగేశ్వర దేవాలయానికి 5 కిలోమీటర్ల దూరంలో విరాటరాజు నిర్మించినట్టు చెప్తున్న మట్టికోటను ఇప్పుడు కూడా చూడొచ్చు. ఆ కొండమీది నుంచి ధారగా వచ్చే జలాన్ని దేవతగా పూజించేవారట. ఆ జలధారే నేడు ధారగంగమ్మగా భక్తుల పూజలందుకుంటోంది. భక్తుల కోర్కెలు నెరవేర్చే తల్లిగా శృంగవరపుకోట గ్రామదేవతగా ఈ ప్రాంత ప్రజల నీరాజనాలందుకుంటోంది. ముఖ్యంగా 1945లో ఎస్.కోట పట్టణంలో ఒక చిన్న మందిరంగా ఏర్పడిన ఈ ఆలయం నేడు సకల సౌకర్యాలతో అలరారుతోంది. ఈ అమ్మవారికి సంవత్సరం విడిచి సంవత్సరం ఘనంగా పండగ నిర్వహిస్తారు.

పుణ్యగిరి క్షేత్రం గురించి చెప్పుకునేటప్పుడు పుణ్యగిరిలోని జలపాతాలకు ఒక పౌరాణిక కథనం ఉంది. అందులో ప్రధానంగా ఇక్కడ అత్యంత ప్రసిద్ధి చెందిన పుట్టుధార గురించి చెప్పుకోవాలి. క్షేత్రంలోని శివలింగం పాదాలను తాకుతూ వచ్చే ఈ పుట్టుధార ఎక్కడ నుంచి వస్తుందో ఎవరికీ తెలియని విషయం.

పురాతన చరిత్ర కలిగిన పుణ్యగిరి శైవక్షేత్రం

ఇది ప్రముఖ శైవక్షేత్రం. ఇటు ప్రకృతి రమణీయతకు, అటు ఆధ్యాత్మిక శోభకు ఆలవాలం ఈ క్షేత్రం. ఎన్నో ఏళ్ల పురాతన చరిత్ర కలిగినది. ఇక్కడ స్నానమాచరించి ఉమా కోటిలింగేశ్వరస్వామిగా వెలసిన పరమేశ్వరుణ్ని దర్శించుకుంటే సర్వపాపాలు వైదొలగుతాయని భక్తుల నమ్మకం. దక్షిణకాశీగా పేరొందిన ఈ క్షేత్రంలో పూర్వం ఎంతోమంది మునీశ్వరులు తపస్సు చేసుకొంటూ శివుడ్ని ఆరాధిస్తూ ఉండేవారట. ఆ క్రమంలోనే శివసాక్ష్యాత్కారం పొందారట. అందుకే ఇక్కడ శివుడు లింగరూపంలో వెలిశాడని ఒక కథనం. మహా శివరాత్రి పర్వదినాన భక్తులు ఉపవాసంతో జాగరం ఉండి, రాత్రి 12 గంటల తర్వాత ఇక్కడి జలధారల కింద స్నానమాచరించి పరమేశ్వరుని దర్శించినా సర్వపాపాలూ తొలగిపోవడమే కాకుండా కైలాసప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం.

పౌరాణిక కథనం

తన కాముకత్వంతో మారువేషంలో ఉన్న ద్రౌపదిని కోరుకున్న కారణంగా భీముని చేతిలో మరణిస్తాడు విరాటరాజు బావమరిది అయిన కీచకుడు. సోదరుడి మరణంతో అపరిమితంగా శోకిస్తుంది విరాటరాజు భార్య, కీచకుని సోదరి అయిన సుధేష్ణాదేవి. ఆమె శోకం తీర్చడానికి ఆమె ఇష్టదైవమైన పరమేశ్వరుడు తన జటాఝూటం విసిరి ధారగా జలాన్ని పుట్టించాడని, అదే కాలక్రమంలో పుట్టుధారగా ప్రాచుర్యంలో కొచ్చిందని భక్తుల నమ్మకం.

ఇక ఇక్కడ మరొక విశిష్టత అస్తిక మంటపం. సహజసిద్ధంగా వెలిచి కోటిలింగాలుగా పిలవబడుతున్న ఇక్కడ శివలింగాలు ఊర్ధ్వదిశలో ఉంటాయి. పైనుంచి నీరు నిరంతరం పడుతూ ఉంటుంది. ఆ నీటిలోనే (మిగతా 10లో...)



ఆధ్యాత్మక శైవక్షేత్రం పుణ్యగిరి

9వ పేజీ తరువాయి

చనిపోయిన వారి అస్తికలను నిమజ్జనం చేసి పితృకార్యాలు చేస్తుంటారు. అందుకనే దీనికి అస్తిక మంటపంగా పేరు స్థిరపడింది. కార్తీకమాసం వచ్చిందంటే ఈ క్షేత్ర పరిసరాలన్నీ శివనామస్మరణతో మారుమోగిపోతాయి. వనభోజనాలకు వచ్చేవారితోను, పరమేశ్వరుని దర్శనంతో జన్మను పునీతం చేసుకోవాలన్న తలంపుతో వచ్చే భక్తులతో కిక్కిరిసిపోతుంది పుణ్యగిరి. ఈ క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. నాలుగు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు ఈ ఆలయ దర్శనానికి వస్తూ ఉంటారు. ఈ రెండు సందర్భాల్లోనూ దేవాదాయ శాఖ వారు భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తారు.

శృంగవరపుకోటకు ఆ పేరు ఎలా వచ్చింది?

ఈ చుట్టు పక్కల ప్రాంతాల పేర్లు కూడా మహాభారత కథనాలకు సంబంధించి పుట్టినవేనని చెబుతారు. ప్రస్తుతం శృంగవరపుకోటగా అని పిలుచుకుంటున్న ప్రాంతంలోనే కీచకుడి కోట ఉండేదని, దీన్ని అతడు తన శృంగార కార్యకలాపాలకు వినియోగించుకునేవాడని, కాలక్రమేణా ఈ ప్రాంతం శృంగారకోటగా ఆ తరువాత శృంగవరపుకోటగా పిలువబడుతుందని పురాతన చరిత్ర చెబుతోంది..

పుణ్యగిరి కొండపైకి వెళ్తున్న యాత్రికులు (ఫైల్)

ప్రజల పక్షాన అక్షర సమరం

(2వ పేజీ తరువాయి)

మీడియాను వేటాడుతుంటే ఆ విలువలు వెలవెలబోతున్నాయి. మరీ ముఖ్యంగా తెలుగునాట ప్రధాన పత్రికలు, ఛానళ్లు రెండు ప్రాంతీయ పాలక పార్టీల మధ్య విభజింపబడి వివాదాలలో మునిగి తేలుతున్నాయి. దేశం నెత్తిన కూచున్న మోడీ అప్రజాస్వామిక పోకడలను బహిర్గతం చేయడం వీటి ఎజెండాలోనే వుండదు. అంతర్జాతీయంగా అమెరికా ఆధిపత్యాన్ని ప్రతిఘటించడమూ వుండదు. పెగాసస్, కాశ్మీర్, రైతాంగ ఆందోళన ఏదైనా సరే ఢిల్లీ పెద్దల దృక్పథానికి విరుద్ధమైన విశ్లేషణలూ, పరిశీలనలూ వీటిలో అరుదుగా గాని కనిపించవు. ఈ సోషల్ మీడియా యుగంలో ఇందుకు సంబంధించిన విస్తారమైన సమాచారం ప్రజాస్వామిక మేధావులు, పాత్రికేయులు, రచయితలు తవ్వితీస్తున్నా వీరికి అక్కర్లేదు. ఈ రాష్ట్రంలో తాము బలపర్చే పక్షాన్ని తలకెత్తుకోడం, అవతలి పక్షంపై దాడి చేయడం అవసరమైతే అందుకు అవాస్తవాలూ అతిశయోక్తులైనా ప్రధానంగా ప్రచారంలో పెట్టడం నిత్యకృత్యమైంది. ఒకరు అధికారంలో వుంటే మరో వైపు మీడియాపై దాడిచేయడం పరిపాటిగా మారింది. ఇతర వాణిజ్య పోకడలు, సంచలనాలు, సెలబ్రిటీ ముచ్చట్లు సరేసరి. ఒకప్పుడు వాటిని మెయిన్ స్ట్రీమ్ పత్రికలనీ, ప్రజాశక్తి వంటి వాటిని వామపక్ష పత్రికలనీ అనేవారు. అయితే ఇప్పుడు ప్రజాశక్తి వంటివి మెయిన్ స్ట్రీమ్ కాగా చాలా పత్రికలు ఆయా పాలక పార్టీల స్ట్రీమ్‌లుగా, స్టీమ్‌లుగా మారాయి. ఈ పరిస్థితుల్లో విశ్వసనీయత, స్వతంత్రత, నిష్పాక్షికతలకు కట్టుబడి ప్రజల పక్షంగా యథార్థాన్ని ఆవిష్కరించే బాధ్యత పూర్తిగా మోస్తున్నది ప్రజాశక్తి వంటి పత్రికలే. అందుకే ప్రజలు వీటిని ఆదరిస్తారు, గౌరవిస్తారు. అయితే రానురాను ఈ సవాళ్లు తీవ్రమవుతాయే గాని తగ్గవు. ఎందుకంటే ప్రత్యామ్నాయ మీడియా అనేది పాలకులకు సింహస్వప్నంగా వుంది. మోడీ అధికారం లోకి రావడానికి ఉపయోగించుకున్న సోషల్ మీడియానే ప్రజాస్వామిక వాదులు ఉపయోగించుకుంటే అపరాధమైపోతున్నది. సుప్రీం కోర్టు ముందు మీడియాకు సంబంధించిన కేసులు ఎన్ని వున్నాయో చెప్పడం కష్టం. ఇలాంటి సమయంలో కాలపరీక్షకు నిలిచిన ప్రజాశక్తిని పటిష్టం చేసుకోవడం, మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతైనా అవసరం. ఆలోచనా పరులు ఎవరైనా పాలకపక్ష మీడియా పోకడలకే కొట్టుకుపోవడంగాక ప్రత్యామ్నాయ, ప్రజాస్వామిక సమాచార స్రవంతిగా ఆశయాలకు ఆలవాలంగా ముందుకు సాగుతున్న ప్రజాశక్తిని తమదిగా భావించాలి. ఎంతో జటిలమైన గత సవాళ్లను అధిగమిస్తూ నాలుగు దశాబ్దాలు నడిచిన ప్రజాశక్తి చరిత్రకు తోడు ఇప్పుడు ఎందరో కొత్త శక్తుల చేరిక, చైతన్యవంతమైన ఉద్యమాల కదలిక అందుకు విశ్వాసమిస్తుంది.

- తెలకపల్లి రవి



ఫ్యాక్టరీ మూతతో చెరకు సాగు ప్రశ్నార్థకం

- తెరిపిస్తేనే కార్మికులకు, రైతులకు బతుకు
- ఎన్నికల హామీలు ఉత్తిదే
- మోసపోయిన రైతాంగం

ప్రజాశక్తి - జామి

భీమసింగి సహకార చక్కెర కర్మాగారం ప్రభుత్వ విధానాల ఫలితంగా మూతపడింది. కానీ ఆ నెపాన్ని రైతులపైకి నెడుతూ సాగు సరిపడా లేకపోవడం వల్లే ఫ్యాక్టరీ నడవడం లేదని జిల్లాకు చెందిన మంత్రి బొత్స పదే పదే చెప్పడం అటు రైతులను, కార్మికులను ఆవేదనకు గురిచేస్తోంది. ఈ ప్రాంత రైతాంగానికి, కార్మికులకు మనుగడగా ఉన్న ఫ్యాక్టరీని మూసేసి, రూ.కోట్ల విలువ చేసే పరిశ్రమ భూములను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెట్టేయడం గొప్ప విషయం కాదు. ఉన్నంతలో ఫ్యాక్టరీని నడిపి రైతులకు బాసటగా నిలవాలన్నది ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష.

భీమసింగి చక్కెర ఫ్యాక్టరీకి సుదీర్ఘకాల చరిత్ర ఉంది. రైతులు వాటా ధనాలతో నిర్మించుకున్న ఈ ఫ్యాక్టరీ మూసేయడం అంటే చరిత్రను చెరిపేయడమే. మరోవైపు ఏళ్లుగా ఫ్యాక్టరీని నమ్ముకుని ఉన్న కార్మికులు, ఉద్యోగులను రోడ్డు పడేయడమే. ఇప్పటికే గత ఏడాదిగా జీతాలు చెల్లించలేని దుస్థితి. సహకార రంగాన్ని బలోపేతం చేస్తానని ఎన్నికల ప్రచారంలో వాగ్దానం చేసిన వైసిపి.. అధికారంలోకి వచ్చి నాలుగేళ్ల నుంచి కమిటీల పేరుతోనే కాలయాపన చేస్తుందన్న ఆరోపణలున్నాయి. కాబట్టి ఫ్యాక్టరీని నిలబెట్టి, అంతకు తగ్గ చెరకు పండించే బాధ్యతను రైతులకు అప్పగించాలి. కానీ చెరకు సాగు లేదన్న సాకుతో ఫ్యాక్టరీని మూసేస్తే, మన కంటిని మన వేలితోనే పొడుచుకున్నట్లు ఉంటుందని విశ్లేషకుల అభిప్రాయం.

టిడిపి ప్రభుత్వ హయాంలో సహకార రంగ ఫ్యాక్టరీలకు ఒక్క రూపాయి కూడా సహకారం అందలేదు. అప్పట్లో చంద్రబాబు కూడా నిపుణుల కమిటీని వేసి, చేతులు దులుపుకున్నారు. చివరికి ప్రభుత్వం దిగిపోయినా, ఆ కమిటీ నివేదిక మాత్రం బహిర్గతం కాలేదు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం వెను వెంటనే సహకార ఫ్యాక్టరీల స్థితిగతులపై గురవారెడ్డి అధ్యక్షతన ఓ కమిటీని వేసింది. ఆ నివేదిక కూడా ఇంతవరకు బయటకు రాలేదు. తర్వాత మరోసారి ప్రభుత్వం గత ఏడాది జూన్ 25న ముగ్గురు మంత్రులతో కమిటీని నియమించింది. ఇందులో జిల్లాకు చెందిన మున్సిపల్ శాఖ మంత్రి బొత్స సత్యనారాయణతోపాటు వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు, పరిశ్రమల శాఖా మంత్రి గౌతమ్ రెడ్డి ఉన్నారు. అదే ఏడాది ఆగస్టు 15 తేదీలోగా, కమిటీ నివేదికను అందజేయాలని ప్రభుత్వం సూచించింది.

ఆందోళనబాట

వాస్తవానికి సహకార ఫ్యాక్టరీలన్నీ 70 శాతం క్రషింగులు కుప్పకూలిపోయాయి. జిల్లాలో భీమసింగి సహకార ఫ్యాక్టరీ ఒకప్పుడు 1.60 లక్షల టన్నులు క్రషింగ్ చేయగా, ప్రస్తుతం 30 వేల టన్నులు కూడా లభ్యం కాదని అధికారులు సెలవిస్తున్నారు. ఇక్కడ కూడా కార్మికులకు ఏళ్ల తరబడి జీతాలు చెల్లించాల్సి ఉంది. గత ఎనిమిది నెలలుగా ఆధునీకరణ చేస్తామన్న పేరుతో క్రషింగ్‌ను ఆపేసింది. దీంతో ఫ్యాక్టరీ మూతబడడం ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ తరుణంలోనే వామపక్షాలు, ప్రతిపక్ష పార్టీలు ఆందోళన బాట పట్టాయి.

ఫ్యాక్టరీని నిలబెట్టే చర్యలపై దృష్టి సారించాలి

సహకార ఫ్యాక్టరీలను బాగు చేసేందుకు అనేక అవకాశాలున్నాయి. ప్రధానంగా సహకార ఫ్యాక్టరీలన్నీ పురాతనమైనవి కావడంతో ముందుగా యంత్రాలను ఆధునీకరించాలి. తక్షణమే క్రషింగ్ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు చర్యలు తీసుకోవాలి. తద్వారా బయో ఉత్పత్తులను తయారు చేసే యూనిట్లు నెలకొల్పడం సాధ్యమవుతుంది. దీనికి సుమారుగా రూ.10 కోట్ల నుంచి 15 కోట్లు అవసరం ఉంటుందని అంచనా. ఈ మూడింటిపై దృష్టిసారిస్తేనే మనుగడ సాధ్యం. ఈ నేపథ్యంలోనే జిల్లా మంత్రులతోపాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు ఫ్యాక్టరీని నిలబెట్టేందుకు దృష్టిసారించాలి. అప్పుడే ఈ ప్రాంత రైతాంగానికి మేలు జరుగుతుంది. వ్యవసాయమే లాభసాటి కోల్పోతున్న నేపథ్యంలో ఏడాదికి గుత్తగా ఆదాయాన్ని సమకూర్చే చెరకు పంట బతకాలంటే, సహకార ఫ్యాక్టరీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా మంత్రులు, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.





పార్టీకి పూర్వవైభవం తెస్తాం

టిడిపి వేపాడ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు

ప్రజాశక్తి-వేపాడ

నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం తీసుకొచ్చి, వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయమే తమ ప్రధాన లక్ష్యమని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు గొంప వెంకటరావు తెలిపారు. ప్రజాశక్తి 43వ వార్షికోత్సవ ప్రత్యేక సంచికకు వెంకటరావు ఇంటర్వ్యూ ఇచ్చారు. వివరాలు ఆయన మాటల్లోనే...

టిడిపి ఆవిర్భావం నుంచి వేపాడ మండలం పార్టీకి కంచుకోటగా నిలిచింది. ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీకి ఆదరణ లభించింది. 2019 ఎన్నికల్లో కొన్ని లోపాల వల్ల ఎమ్మెల్యే స్థానాన్ని కోల్పోయాం. ప్రస్తుతం అధిష్టానం ఆదేశం మేరకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ... నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావడానికి నూటికి నూరు శాతం కృషి చేస్తున్నారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం, యువకులకు పార్టీ విధానాలు వివరించడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ పార్టీ సైనికులను తయారు చేయడంపై ప్రత్యేక దృష్టిపెట్టారు. ఆయనకు నిర్దిష్ట ప్రణాళిక ఉంది. అన్ని సౌకర్యాల కల్పనపై ప్రణాళిక రూపొందించుకుని ముందుకెళ్తున్నారు. అన్నింటికంటే విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. రైతులకు రక్షణ పనిముట్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో టిడిపికి పూర్వవైభవం రావడం ఖాయంగా కనిపిస్తోంది.